అట్టహాసంగా కరుణ స్మారక స్థలం ప్రారంభం





స్మారక స్థల ప్రారంభోత్సవంలో సీఎం స్టాలిన్, మంత్రి దురైమురుగన్, సూపర్ స్టార్ రజనీకాంత్ తదితరులు

చెన్నై, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మెరీనా బీచ్‌లో డీఎంకే వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి అన్నాదురై సమాధి వెనుక డీఎంకే ప్రభుత్వం రూ.39 కోట్లతో నిర్మించిన మాజీ ముఖ్యమంత్రి దివంగత కరుణానిధి స్మారక స్థలాన్ని ఆయన తనయుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ సోమవారం సాయంత్రం ప్రారంభించారు. ఈ వేడుకలో తొలుత భారీ ఎల్ఈడీ స్క్రీన్‌లో కరుణ స్మారక స్థలం గురించి స్టాలిన్ స్వరంతో రూపొందించిన మినీ డాక్యుమెంటరీని ప్రదర్శించారు. సూపర్ స్టార్ రజనీకాంత్ పక్కనే కూర్చుని స్టాలిన్ ఆ డాక్యుమెంటరీని తిలకించారు. అదే వేదికపై మంత్రులు, ఎంపీలు, డీఎంకే మిత్రపక్షాల నాయకులు ఆశీనులై స్మారక స్థలం విశేషాలను స్టాలిన్ స్వరంతో ఆసక్తిగా తిలకించారు. ఆ తర్వాత స్మారక స్థలం ప్రారంభోత్సవాన్ని సూచించే శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కరుణానిధి విగ్రహాన్ని ఆవిష్కరించి ఆయన స్మారక స్థలంపై పుష్పవలయం ఉంచి నివాళి అర్పించారు. ఆ ప్రాంతం నుంచి బ్యాటరీ కారులో కలైంజర్ ఉలగమ్ మ్యూజియానికి చేరుకున్నారు. బ్యాటరీ కారులో స్టాలిన్‌తోపాటు రజనీకాంత్, మంత్రి దురైమురుగన్ తదితరులు ప్రయాణించారు. ఆ తర్వాత 'కలైంజర్ ఉలగమ్' మ్యూజియంను ప్రారంభించారు. ఆ తర్వాత అన్నాదురై సమాధి వద్ద నివాళి అర్పించారు. చివరగా అన్నాదురై సమాధి పునర్నిర్మాణ పనులు, కరుణానిధి స్మారక స్థలాన్ని అందంగా నిర్మించిన కట్టడ నిర్మాణ సంస్థ ప్రముఖులు, కాంట్రాక్టర్లను ముఖ్యమంత్రి స్టాలిన్ శాలువలతో సత్కరించారు.

కరుణానిధి విగ్రహాన్ని తయారు చేసిన శిల్పి దీనదయాళన్ కూడా ఘనంగా సత్కరించారు. ఈ వేడుకల్లో స్పీకర్ అప్పావు, ప్రముఖ తమిళ సినీ గేయరచయిత వైరముత్తు, ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి వైగో, సీపీఐ నేత ముత్తరసన్, సీపీఎం నేత బాలకృష్ణన్, ద్రవిడకళగం నేత కే వీరమణి, డీపీఐ నేత తొల్ తిరుమావలవన్, ఎంపీలు దయానిధి మారన్, కనిమొళి, టీఆర్ బాలు మంత్రులు దురైమురుగన్, ఉదయనిధి స్టాలిన్, పీకే శేఖర్‌బాబు, ఎం. సుబ్రమణ్యం, అన్బిల్ మహేష్ కేఎన్ నెహ్రూ, పొయ్యామొళి, మేయర్ ఆర్ ప్రియ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శివదాస్ మీనా తదితరులు పాల్గొన్నారు.

కరుణ స్మారక స్థలం విశేషాలు...

రాష్ట్ర ప్రజాపనుల శాఖ కరుణ సమాధి ప్రాంతాన్ని అందంగా తీర్చిదిద్దింది. కరుణ స్మారక స్థలం వద్ద డిజిటల్ మ్యూజియాన్ని ఏర్పాటు చేసింది. అదే సమయంలో అన్నాదురై సమాధిని కొత్త సొబగులతో అద్దింది. అన్నాదురై స్మారక స్థలంలోకి ప్రవేశించగానే ఇళంగో అడిగళ్, కంబర్ విగ్రహాలు దర్శనమిస్తాయి. ఆ విగ్రహాల వద్ద ఆశీనులై పుస్తకపఠనం చేస్తున్న రీతిలో అన్నాదురై విగ్రహం కనిపిస్తుంది. అన్నాదురై సమాధి వెనుక అడుగుపెడితే కరుణానిధి స్మారక స్థలం ఉంది. అక్కడ ఆశీనులై పుస్తక రచన చేస్తున్న రీతిలో కరుణానిధి విగ్రహం కనిపిస్తుంది. అదే ప్రదేశంలో తమిళభాషకు ప్రాచీన హోదా పొందటానికి పాటుపడిన కరుణానిధిని ప్రశంసిస్తూ ఏఐసీసీ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ 2005లో ఆంగ్లంలో ప్రశంసిస్తూ రాసిన లేఖ శిలాఫలకంగా ఏర్పాటు చేశారు. కరుణ స్మారక స్థలం చుట్టూ ఆయన తెలిపిన పలు రకాల సూక్తులు శిలాఫలకాలుగా దర్శనమిస్తాయి. పచ్చిక బయళ్లతో పూల చెట్లతో ఆ ప్రాంతం కనువిందు చేస్తోంది. చలువరాతితో ద్రావిడ నిర్మాణ శైలి చాటే రీతిలో కరుణ స్మారక స్థలం నిర్మితమైంది. కరుణ సమాధి వెనుక వియత్నాం నుంచి తెప్పించిన గ్రానైట్‌తో చెక్కబడిన ఆయన ఆకారం కనిపిస్తుంది. పగటిపూట తెలుపురంగుతో ఈ ఆకారం కనిపిస్తుంది. రాత్రిపూట లేజర్ లైటింగ్స్‌తో ఆ ఆకారం చూపరులను మైమరపిస్తుంది. ఇక స్మారక స్థలానికి చేరువగా 20 వేల చదరపుటడుగుల విస్తీర్ణంలో 'కలైంజర్ ఉలగమ్' పేరుతో రూపొందిన డిజిటల్ మ్యూజియానికి వెళ్లేందుకు సొరంగమార్గం ఉంది. లోపలకు ప్రవేశించిగానే ఏసీ యంత్రం నుండి చల్లటి గాలులు వీస్తాయి. కరుణ రచించిన పుస్తకాల పేర్లు కనిపిస్తాయి. కరుణ సభలలో కార్యకర్తలను సంబోధించే వాక్యం కూడా ఆ మ్యూజియంలో చెక్కబడి ఉంది. మ్యూజియంలో కరుణ జీవిత విశేషాలకు సంబంధించిన ఫొటోల ప్రదర్శనను కూడా ఏర్పాటు చేశారు. ఇన్ని హంగులతో ఆకర్షణీయంగా నిర్మితమైన ఈ స్మారక స్థలం చారిత్రక ప్రాధాన్యతను సంతరించుకుంటుందని స్టాలిన్ ప్రకటించారు.



ఎన్నికల సందడి మొదలు

● రాష్ట్రంపై ఈసీ డేగ కన్ను

చెన్నై, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే రాష్ట్రవ్యాప్తంగా పోలీసులు నిఘా తీవ్రతరం చేశారు. నోటిఫికేషన్ మార్చి రెండో వారంలో విడుదలయ్యే అవకాశాలున్నాయని అధికారులు చెబుతున్నారు. అదే సమయంలో రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీలన్నీ జనవరి నుంచే పొత్తులపై, ఎన్నికల మేనిఫెస్టోల తయారీపై, సీట్ల కేటాయింపులపై దృష్టి సారించాయి. డీఎంకే, అన్నాడీఎంకే, బీజేపీలు మెగా కూటములను ఏర్పాటు చేసుకునేందుకు తహతహలాడుతున్నాయి. డీఎంకే తర్వాత అన్నాడీఎంకేలోనే ఎన్నికల సందడి కన్పిస్తోంది. అన్నాడీఎంకేతో పొత్తుపెట్టుకునేందుకు వన్నియార్ల ఓటు బ్యాంక్‌ను కలిగి ఉన్న పీఎంకే, సొంత ఇమేజ్‌తో రాష్ట్ర రాజకీయాలతో తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్న దివంగత విజయ్‌కాంత్ నెలకొల్పిన డీఎండీకే తీవ్ర ప్రయత్నాలు సాగిస్తున్నాయి. బీజేపీ కూడా ఎలాగైనా తమ కూటమిలోకి డీఎండీకేని చేర్చుకోవాలని ఆరాటపడుతోంది. ఇలా రాజకీయ పార్టీలన్నీ లోక్‌సభ ఎన్నికలపైనే కసరత్తులు చేస్తున్న నేపథ్యంలో రాష్ట్ర పోలీసు ఉన్నతాధికారులు కూడా ముందస్తుగానే ఎన్నికల ప్రత్యేక విధులను అప్పుడే ప్రారంభించారు. గ్రేటర్ చెన్నై పోలీసు కమిషనరేట్‌లో ఇప్పటికే మూడు చోట్ల ఎన్నికల కంట్రోల్ రూంలు, ప్రత్యేక ఫిర్యాదుల విభాగాలు ఏర్పాటయ్యాయి. రాష్ట్ర డీజీపీ శంకర్‌జివాల్ కార్యాలయం, గ్రేటర్ చెన్నై పోలీసు కమిషనర్ కార్యాలయంలోనూ లోక్‌సభ ఎన్నికలకంటూ ప్రత్యేక విభాగాలు పని చేస్తున్నాయి. డిప్యూటీ పోలీసు కమిషనర్ మహేశ్వరన్ నాయకత్వంలో 48మంది పోలీసులతో ఏర్పాటైన ఈ ప్రత్యేక నిఘా విభాగం నగరమంతటా 80 ప్రాంతాల వద్ద వాహన తనిఖీలు చేపట్టనున్నాయి. గత లోక్‌సభ ఎన్నికల సమయంలో అత్యధికంగా ఓట్లు పోలైన పోలింగ్ కేంద్రాల వద్ద, అల్లర్లు, ఘర్షణలు జరిగిన ప్రాంతాల వద్ద, అభ్యర్థులపై నమోదైన కేసులపైనా ఈ నిఘా విభాగం ప్రస్తుతం తీవ్ర పరిశీలనలు జరుపుతోంది. గ్రేటర్ చెన్నై పోలీసు కమిషనరేట్ పరిధిలో ఐదు లోక్‌సభ నియోజకవర్గాలు ఉన్నాయి. సౌత్‌చెన్నై, నార్త్ చెన్నై, సెంట్రల్ చెన్నై తదితర మూడు లోక్‌సభ నియోజకవర్గాలు ఉన్నాయి. వీటిలో ఉత్తర చెన్నై నియోజకవర్గంలో భారీ భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని పోలీసు ఉన్నతాధికారులు భావిస్తున్నారు. అదే విధంగా శ్రీపెరుంబుదూరు, తిరువళ్లూరు లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలో ఉన్న కొన్ని ప్రాంతాలల్లోనూ గట్టి భద్రత కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక నిఘా దళాలు ఏర్పాటు కానున్నాయి. చెన్నైలో 80 ప్రాంతాల వద్ద వాహన తనిఖీలు చేపట్టడానికి పోలీసు ప్రత్యేక దళాల అధికారులు సిద్ధమవుతున్నారు. పోలీసులతోపాటు కార్పొరేషన్ అధికారులు కూడా నగర పరిధిలోని మూడు లోక్‌సభ నియోజకవర్గాల్లో తనిఖీలు జరుపనున్నారు. ఓటర్లకు నగదు పంపిణీ చేయడానికి వాహనాల్లో భారీ స్థాయిలో నగదు తరలించకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టనున్నామని పోలీసు ఉన్నతాధికారి తెలిపారు. ప్రస్తుతం నగరమంతటా పాత నేరస్థుల వివరాలను సేకరిస్తున్నామని, ఎన్నికల సమయంలో ఘర్షణలకు పాల్పడిన రౌడీషీటర్లను అదుపులోకి తీసుకుంటామని, అల్లర్లకు అవకాశమున్న ప్రాంతాల్లో పోలీసు బలగాలను పెంచనున్నామని ఆయన వివరించారు.



వాహన తనిఖీల్లో పోలీసులు

పట్టాలు తప్పిన ఊటీ కొండరైలు



పట్టాలు తప్పటంతో ఆగిన ఊటీ కొండ రైలు

చెన్నై, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఊటీ కొండరైలు ఫెర్న్‌హిల్ వద్ద పట్టాలు తప్పింది. రైలులోని ప్రయాణికులకు ఎలాంటి ముప్పువాటిల్లలేదు. మేట్టుపాళయం నుంచి ఊటీకి 220 మంది ప్రయాణికులతో సోమవారం ఉదయం వస్తుండగా ఊటీ రైల్వే స్టేషన్‌కు కిలోమీటర్ దూరంలో ఫెర్న్‌హిల్ వద్ద పట్టాలు తప్పింది. ఆ ప్రాంతం వద్ద ఉన్నట్టుండి తోడా గిరిజనులు పెంచుతున్న బర్రెలు పట్టాలకు అడ్డంగా రావడంతో రైలింజన్ డ్రైవర్ సడెన్ బ్రేక్ వేశారు. దీనితో ఆ రైలింజన్‌ను ఆనుకుని ఉన్న బోగీ పట్టాలు తప్పింది. ఈ సమాచారం అందుకున్న రైల్వే ఉన్నతాధికారులు, సిబ్బంది హుటాహుటిన అక్కడికి చేరుకుని ప్రయాణికులను వివిధ వాహనాల్లో ఊటీకి తరలించారు. రైల్వే ఇంజనీరింగ్ నిపుణులు బోగీని భారీ క్రేన్‌ల సాయంతో పట్టాలపైకి ఎక్కించే పనులు ప్రారంభించారు. ఈ సంఘటన కారణంగా మేట్టుపాళయం - ఊటీ మార్గంలో ఇరువైపులా రైలు సేవలను రద్దు చేశారు.



పట్టాలు తప్పిన మొదటి బోగీ చక్రాలు



వరాహస్వామి ఆలయం వద్ద శశికళ

తిరుమలలో శశికళ

తిరుమల, ఫిబ్రవరి26(ఆంధ్రజ్యోతి): తమిళనాడు మాజీ సీఎం జయలలిత స్నేహితురాలు శశికళ శ్రీవారి దర్శనార్థం సోమవారం రాత్రి తిరుమలకు వచ్చారు. రచన అతిథి గృహానికి చేరుకున్న అనంతరం ఆమె క్షేత్ర సంప్రదాయాన్ని పాటిస్తూ శ్రీవారి ఆలయం పక్కనే ఉన్న వరాహస్వామిని దర్శించుకున్నారు. తిరిగి అతిథి గృహానికి చేరుకుని రాత్రి బస చేశారు. కాగా, మంగళవారం ఉదయం శశికళ ఆలయంలోకి వెళ్లి శ్రీవారిని దర్శించుకోనున్నారు.

మంత్రి పెరియస్వామి విడుదల చెల్లదు

● మద్రాసు హైకోర్టు



మంత్రి పెరియస్వామి

పెరంబూర్, ఫిబ్రవరి 26: గృహవసతి బోర్డుకు చెందిన ఇళ్ల కేటాయింపులో అవినీతి కేసులో మంత్రి ఐ.పెరియస్వామిని విడుదల చేస్తూ ప్రత్యేక న్యాయస్థానం జారీ చేసిన ఉత్తర్వులను మద్రాసు హైకోర్టు రద్దు చేసింది. ఈ మేరకు హైకోర్టు సోమవారం తీర్పు వెలువరించింది. అలాగే, సరైన అనుమతులు పొంది కేసును విచారించాలని అవినీతి నిరోధక శాఖను ఆదేశించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి వెలువరించిన తీర్పులో... కేసు నుంచి ఐ.పెరియస్వామి విడుదల చెల్లదు. ఆయన కేసు విచారణ ఎదుర్కోవాలి. కాబట్టి ప్రత్యేక న్యాయస్థానం ఐ.పెరియస్వామిని విడుదల చేసే ఉత్తర్వులు రద్దు చేస్తున్నాం. ఈ కేసులో ఐ.పెరియస్వామి బుధవారం రూ.లక్ష జరిమానా చెల్లించాలి. వచ్చే ఏడాదిలోపు ఈ కేసు విచారణ ముగించాలి. జూలై నెల లోపు కేసు విచారణ ప్రారంభించాలి అంటూ ఉత్తర్వులు జారీ చేశారు.

కేసు పూర్వాపరాలు...

రాష్ట్ర గృహవసతి శాఖ మంత్రి ఐ.పెరియస్వామి గత 2008లో మంత్రి పదవిలో ఉండగా, గృహవసతి బోర్డుకు చెందిన ఇంటిని దివంగత మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి భద్రతాదారుడు గణేశన్‌కు కేటాయించడంలో అవినీతి జరిగిందని అవినీతి నిరోధక శాఖ కేసు నమోదు చేసింది. ఈ కేసు ఎంపీ, ఎమ్మెల్యేలపై నమోదైన కేసులు విచారిస్తున్న ప్రత్యేక న్యాయస్థానం ఆ కేసు నుంచి మంత్రి పెరియస్వామిని విడుదల చేస్తూ తీర్పు వెలువరించింది. ఈ తీర్పు పునఃసమీక్షించేలా మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి ఎన్.ఆనంద్ వెంకటేశ్ సుమోటోగా కేసు స్వీకరించారు. ఈ కేసులో ఈనెల 13వ తేది అన్ని వాదనలు ముగిసిన నేపథ్యంలో, తేది ప్రకటించకుండా తీర్పు వాయిదా వేశారు. కాగా, మంత్రులు సాత్తూర్ రామచంద్రన్, తంగం తెన్నరసు, మాజీ మంత్రి పొన్ముడి, మాజీ ముఖ్యమంత్రి ఓ.పన్నీర్‌సెల్వం, మాజీ మంత్రి వలర్మతి తదితరులపై ఉన్న కేసులను న్యాయమూర్తి ఆనంద్ వెంకటేశ్ సుమోటోగా స్వీకరించి విచారిస్తున్నారు. వాటిలో వలర్మతి కేసు విచారణకు మాత్రం సుప్రీంకోర్టు తాత్కాలిక స్టే విధించిన విషయం తెలిసిందే.

రేపటినుంచి పద్మావతి అమ్మవారి ఆలయ బ్రహ్మోత్సవాలు

● భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు ● సలహామండలి అధ్యక్షుడు ఏజే శేఖర్

చెన్నై, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక జీఎన్ చెట్టిరోడ్డులో వున్న పద్మావతి అమ్మవారి ఆలయంలో ఈనెల 28న బుధవారం నుంచి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ఇందుకు సంబంధించి ఆలయాన్ని పుష్పాలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఈ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం 9-11.30 గంటల మధ్య కుంకుమార్చన, సాయంత్రం 6.30-8.00 గంటల మధ్య విష్వక్సేన ఆరాధన అంకురార్పణ జరగనున్నాయి. బ్రహ్మోత్సవాల్లో తొలిరోజు ఉదయం 8-11.30 గంటల మధ్య ధ్వజారోహణం జరగనుండగా, సాయంత్రం 7 గంటలకు చిన్న శేషవాహనంపై తాయారు అమ్మవారు భక్తులకు దర్శనమివ్వనున్నారు. అదే విధంగా 29న ఉదయం 9 గంటలకు పెద్ద శేష వాహనం, సాయంత్రం 7 గంటలకు హంస వాహనం, మార్చి 1వ తేదీన ఉదయం 9 గంటలకు ముత్యపు పందిరి, సాయంత్రం 7 గంటలకు సింహవాహనం, 2వ తేదీన ఉదయం 9 గంటలకు కల్పవృక్ష వాహనం, సాయంత్రం 7 గంటలకు హనుమంత వాహనం, 3వ తేదీన ఉదయం 9 గంటలకు పల్లకి ఉత్సవం, సాయంత్రం 7 గంటలకు గజ వాహనం, 4న ఉదయం 9 గంటలకు సర్వభూపాల వాహనం, సాయంత్రం 7 గంటలకు గరుడ వాహనం, 5న ఉదయం 9 గంటలకు సూర్యప్రభ వాహనం, సాయంత్రం 7 గంటలకు చంద్రప్రభ వాహనం, 6న ఉదయం 9 గంటలకు రథోత్సవం, సాయంత్రం 7 గంటలకు అశ్వవాహనంపై అమ్మవారు భక్తులను కటాక్షించనున్నారు. 7వ తేదీ ఉదయం 9 గంటలకు చక్రస్నానం, 8న ఉదయం 9 గంటలకు పుష్పయాగం జరగనుంది. ప్రతిరోజూ సాయంత్రం జీఎన్ చెట్టిరోడ్డు, బోగ్‌రోడ్, విజయరాఘవరోడ్డు, నాయర్ రోడ్డుల్లో అమ్మవారి ఊరేగింపు ఉంటుందని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) తమిళనాడు,పుదుచ్చేరి ఆలయాల సలహామండలి అధ్యక్షుడు ఏజే శేఖర్ తెలిపారు. సోమవారం సాయంత్రం ఆయన మండలి ఉపాధ్యక్షుడు శరణ్‌రెడ్డి, సభ్యులు బి.మోహన్‌రావు, పీవీ కృష్ణారావు, కె.అనిల్‌కుమార్‌రెడ్డి, కిశోర్, కార్తికేయన్, జయదేవ్, టీటీడీ సూపరింటెండెంట్ పుష్పలత తదితరులతో కలిసి మీడియాతో మాట్లాడుతూ... బ్రహ్మోత్సవాల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టామని తెలిపారు. ఉదయం, సాయంత్రం అన్నదానం నిర్వహించనున్నామని, అదే విధంగా ప్రసాదాల వితరణ కూడా ఉంటుందన్నారు. ఎంతమంది భక్తులు వచ్చినా ఇబ్బంది లేకుండా ఉండేలా చర్యలు చేపట్టామన్నారు. ప్రత్యేక పోలీసు భద్రత కూడా ఏర్పాటు కానుందని వివరించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రతిరోజూ సాయంత్రం పలువురు కళాకారులు పెరుమాళ్, తాయారు కీర్తనలు ఆలపించనున్నారని పేర్కొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న ఏజే శేఖర్ బృందం

నేడు చెన్నైకి లోకేశ్



చెన్నై, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, యువ నేత నారా లోకేశ్ మంగళవారం చెన్నై రానున్నారు. ప్రత్యేక హెలికాప్టర్‌లో ఉండవల్లి నుంచి ఉదయం 8.20 గంటలకు చెన్నై విమానాశ్రయం చేరుకోనున్న లోకేశ్‌కు టీడీపీ శ్రేణులు, పార్టీ మద్దతుదారులు, తెలుగు ప్రముఖులు స్వాగతం పలకనున్నారు. విమానాశ్రయంలో తెలుగు ప్రముఖులను కలుసుకున్న అనంతరం ఉదయం 9.10 గంటలకు శ్రీపెరుంబుదూర్‌లోని శ్రీరామానుజర్ ఆలయానికి చేరుకోనున్న లోకేశ్... అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అనంతరం అక్కడి నుంచి మళ్లీ విమానాశ్రయం చేరుకుని 11 గంటలకు ప్రత్యేక హెలికాప్టర్‌లో బయలుదేరి ఉండవల్లికి చేరుకుంటారు. లోకేశ్ రాకను పురస్కరించుకుని, ఆయనకు ఘనంగా స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేపట్టినట్లు టీడీపీ చెన్నై విభాగ అధ్యక్షుడు చంద్రశేఖర్ తెలిపారు.

సమాచార దర్శిని

బీబీఏ దరఖాస్తు గడువు పొడిగింపు

ఐసిఎఫ్, ఫిబ్రవరి 26: బీబీఏ, బీసీఏ కోర్సుల అనుమతికి సంబంధించిన దరఖాస్తు స్వీకరణ గడువ పొడిగిస్తూ ఏఐసీటీఈ ఉత్తర్వులు జారీ చేసింది. దేశవ్యాప్తంగా ఉన్నత విద్యాసంస్థలు 2024-25 విద్యా సంవత్సరంలో బీఎంఎస్, బీసీఏ, బీబీఏ కోర్సులకు ఏఐసీటీఈ అనుమతి పొందేందుకు దరఖాస్తు స్వీకరణ డిసెంబరులో ప్రారంభమై ఆదివారంతో ముగిసింది. అనుమతి పొందితే తప్ప ఏఐసీటీఈ ప్రయోజనాలు పొందానికి వీల్లేదు. దీంతో గడువు పొడిగించాలని విద్యాసంస్థలు విజ్ఞప్తి చేయడంతో మార్చి 7వ తేది వరకు గడువు పొడిగించారు.

446 మంది గ్రామ లైబ్రేరియన్లకు పదోన్నతి

పెరంబూర్, ఫిబ్రవరి 26: రాష్ట్రవ్యాప్తంగా 446 మంది గ్రామ లైబ్రేరియన్లను మూడో స్థాయి లైబ్రేరియన్లుగా పదోన్నతి కల్పిస్తూ రాష్ట్రప్రభుత్వం సోమవారం జీవో విడుదల చేసింది. పదేళ్లకు పైగా ఎలాంటి పదోన్నతులు పొందని వీరు ప్రస్తుతం ప్రమోషన్ కల్పించడంపై హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రశ్నపత్రం లీకేజీ.... ప్లస్ టూ పరీక్ష వాయిదా

పెరంబూర్, ఫిబ్రవరి 26: ప్రశ్నాపత్రం లీకేజీ కారణంగా ప్లస్ టూ ఐఎస్సీ కెమిస్ట్రీ పరీక్ష వాయిదా వేసినట్లు ప్రభుత్వ పరీక్ష శాఖ తెలిపింది. సోమవారం జరగాల్సిన ఈ పరీక్ష మార్చి 21వ తేది నిర్వహించనున్నట్లు ప్రకటించారు.

విద్యుత్ మీటర్ల కొనుగోలుకు అనుమతి

ఐసిఎఫ్, ఫిబ్రవరి 26: ప్రైవేటు సంస్థల నుంచి విద్యుత్ మీటర్లు కొనుగోలు చేసేందుకు వినియోగదారులకు విద్యుత్ బోర్డు అనుమతించింది. విద్యుత్ మీటరు డిపాజిట్లుగా భూగర్భ కేబుల్ ద్వారా సరఫరా అయ్యే విద్యుత్ కనెక్షన్‌కు రూ.765, త్రీ ఫేజ్‌కు రూ.2,045 వసూలు చేస్తున్నారు. ఈ రుసుము గ్రామాల్లో మార్పు ఉంటుంది. కొత్త కనెక్షన్లు కోసం దరఖాస్తు చేసుకున్న 30 రోజుల్లో ఇస్తున్నారు. కొన్ని చోట్ల మీటర్ల కొరత కారణంగా ఆలస్యం అవుతోంది. ఈ సమస్య పరిష్కరించేలా ప్రైవేటు సంస్థల నుంచి మీటర్ల కొనుగోలుకు వినియోగదారులకు అనుమతినిచ్చారు.

సిండికెట్ కౌన్సిల్‌లో నలుగురు సభ్యులు

ఐసిఎఫ్, ఫిబ్రవరి 26: మద్రాసు విశ్వవిద్యాలయ సిండికెట్ కౌన్సిల్‌కు నలుగురు సభ్యులు నియమితులయ్యారు. రాష్ట్రంలో విశ్వవిద్యాలయాల్లో విద్య, నిర్వహణకు సంబంధించిన నిర్ణయాలు, వ్యయాలు, కొత్త పథకాలు, ఆయా వర్శిటీ సిండికెట్ కౌన్సిల్ ఆమోదించి పొందడం ఆనవాయితీ. ఈ కౌన్సిల్‌లో ఉపకులపతి, రిజిస్ట్రార్, ప్రొఫెసర్లు, విద్యావేత్తలు, శాసనసభ్యులు సహా పలువురు చోటుచేసుకుంటారు. ఈ నేపథ్యంలో, సిండికెట్‌కు కొత్తగా అరుంబాక్కం డీజీ వైష్ణవ కళాశాల అధ్యాపకులు వేల్‌మురుగన్, మైలాపూర్ రామకృష్ణ మిషన్ వివేకానంద కళాశాల సహాయ ప్రొఫెసర్ ఆనంద్, మీనంబాక్కం ఏఎం జైన్ కళాశాల అధ్యాపకులు ఆనందనారాయణన్, తాంబరం ఎంసీసీ ప్రిన్సిపాల్ విల్సన్ నియమితులయ్యారు. వీరు 2027 ఫిబ్రవరి 23వ తేది వరకు మూడేళ్ల పదవుల్లో కొనసాగనున్నారు.

రూ.3.2 కోట్లతో రోడ్డు పనులు

ఐసిఎఫ్, ఫిబ్రవరి 26: స్థానిక పల్లావరంలో రూ.3.2 కోట్లతో రోడ్ల నిర్మాణపనులు జరుగుతున్నాయి. వర్షాలకు దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టడంతో పాటు కొత్త రోడ్లు వేసే పనులు పొలిచ్చలూరులో ఉన్న నెహ్రూ నగర్, అగస్తీశ్వర నగర్, లక్ష్మీ నగర్, శివశంకర్ నగర్, భవానీ నగర్, వినాయక నగర్, దివ్యదాస్ నగర్ తదితర ప్రాంతాల్లో ప్రారంభమయ్యాయి.

ఇంటి వద్దకే జరిమానా రసీదులు

ఐసిఎఫ్, ఫిబ్రవరి 26: నిబంధనలు ఉల్లంఘించే వాహన చోదకులకు జరిమానా రసీదులు ఇంటికి పంపించే విధానం ప్రారంభమైంది. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వాహన చోదకులకు పోలీసులు జరిమానా విధించి కేసులు నమోదు చేస్తుంటారు. ఈ నేపథ్యంలో, పోలీసుల నుంచి తప్పించుకు పారిపోయే వాహన చోదకులకు వారి వాహన నెంబరు ఆధారంగా ఇంటికే జరిమానా రసీదులు పంపి, రుసుము వసూలుచేసే పథకాన్ని ట్రాఫిక్ విభాగం ప్రారంభించింది. ఈ పథకాన్ని త్వరలో రాష్ట్రవ్యాప్తంగా విస్తరించనున్నట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

రెన్యువల్ చేయని 10 వేల పాఠశాలలు

ఐసిఎఫ్, ఫిబ్రవరి 26: రాష్ట్రప్రభుత్వ ప్రైవేటు స్వయం ప్రతిపత్తి పాఠశాలలకు ప్రత్యేక డైరెక్టరేట్ ఏర్పాటుచేసినప్పటికీ, డీటీసీటీ ఆదేశాలు పొందాలన్న ఒకే కారణంగా 10 వేలకుపైగా పాఠశాలల అనుమతిని ఇప్పటివరకు రెన్యువల్ చేయలేదు. డీటీసీటీ అనుమతి లేకుండా మూడేళ్ల రెన్యువల్ చేసేందుకు ఉత్తర్వులు జారీ చేయాలని, గత ఏడాది ప్రైవేటు పాఠశాలల్లో నిర్బంధ విద్యా చట్టం ప్రకారం విద్యా ఫీజు రూ.1,000 కోట్లు ప్రభుత్వం వెంటనే ఇవ్వాలని, ఎల్కేజీ, యూకేజీ విద్యార్థులకు గరిష్ఠంగా రూ.6 వేల నుంచి రూ.12 వేలకు పెంచాలని ప్రైవేటు పాఠశాలల సంఘాల సమాఖ్య అధ్యక్షుడు ఆర్ముగం ప్రభుత్వాన్ని కోరారు.

కూవంలో ఫ్లై ఓవర్ పనులు

ఐసిఎఫ్, ఫిబ్రవరి 26: కూవం నదిలో ఫ్లై ఓవర్ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. మదురవాయల్ మీదుగా వెళ్లే కూవం నదికి అడ్డుగా తిరువేర్కాడు, అడయార్, మదురవాయల్, నొలంబూర్ వంటి ప్రాంతాల్లో నేల వంతెనలు ఏర్పాటు చేశారు. వర్షాకాలంలో ఈ వంతెనలు మునగడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. వీటి స్థానంలో ఫ్లై ఓవర్ నిర్మించేందుకు కార్పొరేషన్ చర్యలు చేపట్టింది. ఆ ప్రకారం నొలంబూర్ యూనియన్ రోడ్డు సన్నిధి మొదటి క్రాస్ వీధి, పూందమల్లి హైరోడ్డుకు అనుసంధానానికి రూ.31.65 కోట్లు, చిన్న నొలంబూర్-పూందమల్లి హైరోడ్డు అనుసంధానం చేసేలా రూ.42.71 కోట్లతో రెండు ఫ్లైఓవర్ల నిర్మాణపనులు ప్రారంభమయ్యాయి.

హైకోర్టుకు కొత్త వెబ్‌సైట్

ఐసిఎఫ్, ఫిబ్రవరి 26: మద్రాసు హైకోర్టుకు కొత్తగా రూపొందించిన వెబ్‌సైట్ శుక్రవారం నుంచి అందుబాటులోకి వచ్చింది. కోర్టులో ఉన్న కేసుల స్థితి, ఉత్తర్వులు, తీర్పులకు సంబంధించిన పారదర్శక సమాచారాలను తెలుసుకొనేలా ఇదివరకే ఓ వెబ్‌సైట్ అందుబాటులో ఉంది. ఆ వెబ్‌సైట్‌కు కొన్ని మార్పులు చేపట్టి కొత్తగా విడుదల చేశారు. ఈ వెబ్‌సైట్ ఈనెల 23వ తేది నుంచి అందుబాటులోకి వచ్చిందని హైకోర్టు ప్రధాన రిజిస్ట్రార్ జ్యోతిరామన్ తెలిపారు.

చంద్రశేఖరన్‌కు బిజినెస్ లీడర్షిప్ అవార్డు

చెన్నై, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): 'టాటా సన్స్ లిమిటెడ్' ఛైర్మన్ ఎన్.చంద్రశేఖరన్ ఈ ఏడాదికి ఎంఎంఏ-అమాల్గమేషన్స్ బిజినెస్ లీడర్ షిప్ అవార్డుకు ఎంపికయ్యారు. దీన్ని ఈ నెల 28న చెన్నైలో జరగనున్న ప్రత్యేక కార్యక్రమంలో ప్రదానం చేయనున్నారు. ఈ అవార్డును 1969లో తన తండ్రి ఎ.శివశైలం స్మారకార్థం అమాల్గమేషన్స్ గ్రూపు ఛైర్మన్ ఎ.అనంతరామకృష్ణన్ ఏర్పాటు చేశారు. భారతీయ వాణిజ్యంలో వినూత్న ఆవిష్కరణల పెంపొందించడం ద్వారా సమాజానికి గణనీయమైన కృషి చేసిన వారికి ఈ అవార్డును యేటా ప్రదానం చేస్తున్న విషయం తెలిసిందే.

రాష్ట్రంలో 34 రైల్వేస్టేషన్లకు కొత్త మెరుగులు

- శంకుస్థాపన చేసిన ప్రధాని
- నేడు తిరుప్పూరు జిల్లాకు రాక




పరంగిమలై సభలో గవర్నర్ ఆర్ఎన్ రవి తదితరులు - కోయంబత్తూరు జిల్లా మేట్టుపాళయంలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర మంత్రి ఎల్.మురుగన్ తదితరులు

చెన్నై, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 34 రైల్వే స్టేషన్లను అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి పరిచే పనులకు ప్రధాని నరేంద్రమోదీ సోమవారం మధ్యాహ్నం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శంకుస్థాపన చేశారు. రైల్వేస్టేషన్ల పునర్నిర్మాణ, మరమ్మతు లకు డిల్లీలో ఏర్పాటైన కార్యక్రమంలో శ్రీకారం చుట్టారు. రాష్ట్రంలోని తిరునల్వేలి జంక్షన్, కుంభకోణం, ఈరోడ్ జంక్షన్, అంబత్తూరు, దిండుగల్ జంక్షన్, హోసూరు, ధర్మపురి, తిరుచెందూరు, మేట్టుపాళయం, మాంబళం, బీచ్‌స్టేషన్, పరంగిమలై, తిరుపత్తూరు, పుదుకోట, గిండి, నామక్కల్, పళని, కారైక్కుడి జంక్షన్, మొరాపూరు, చిన్న సేలం, కోయంబత్తూరు నార్త్, బొమ్మిడి, రాజపాళయం, రామనాథపురం, చెన్నై పార్క్, పొల్లాచ్చి జంక్షన్, కోవిల్‌పట్టి, తూత్తుకుడి, అంబాసముద్రం, పరమక్కుడి, మనప్పారై, విరుదాచలం జంక్షన్, తిరువారూరు జంక్షన్, తిరువణ్ణామలై రైల్వే స్టేషన్లు కొత్త రూపును సంతరించుకోనున్నాయి. స్థానిక చెన్నై బీచ్‌స్టేషన్, గిండి, పరంగిమలై స్టేషన్లలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శంకుస్థాపన చేస్తున్న దృశ్యాలను భారీ ఎల్ఈడీ స్క్రీన్‌లపై ప్రత్యక్ష ప్రసారం చేశారు. పరంగిమలైలో ఏర్పాటైన కార్యక్రమంలో గవర్నర్ ఆర్ ఎన్ రవి పాల్గొన్నారు. మేట్టుపాళయం రైల్వేస్టేషన్ వద్ద జరిగిన కార్యక్రమంలో కేంద్ర మంత్రి ఎల్ మురుగన్ తదితరులు పాల్గొన్నారు.

హత్యకేసు నుంచి డీఎంకే మాజీ ఎమ్మెల్యే విడుదల



మాజీ ఎమ్మెల్యే రంగనాథన్

పెరంబూర్, ఫిబ్రవరి 26: భూ మధ్యవర్తి హత్యకేసులో డీఎంకే మాజీ ఎమ్మెల్యే రంగనాథన్‌ను విడుదల చేస్తూ ప్రత్యేక న్యాయస్థానం తీర్పు వెలువరించింది. కొళత్తూర్ గాంధీనగర్‌కు చెందిన దివ్యాంగుడైన భువనేశ్వరన్ భూ మధ్యవర్తి. భూ తగదాల కారణంగా 2012 జనవరి 10వ తేది హత్యకు గురయ్యాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన కొళత్తూర్ పోలీసులు సయ్యద్ ఇబ్రహీం, సెల్వం, మురళి, కుమార్‌పై చార్జిషీటు దాఖలు చేశారు. హత్యకు పురిగొల్పినట్టు డీఎంకే మాజీ ఎమ్మెల్యే రంగనాథన్ పేరు చేర్చలేదంటూ భువనేశ్వర్ తండ్రి శివ మద్రాసు హైకోర్టును ఆశ్రయించాడు. దీంతో చార్జిషీటు రద్దు చేసిన హైకోర్టు... డీఎస్పీ కన్నా తక్కువైన అధికారి నేతృత్వంలో, సీబీఐ విచారణ జరిపి నివేదిక దాఖలు చేయాలని 2014లో ఉత్తర్వులు జారీ చేసింది. దీనిపై విచారణ జరిపిన సీబీఐ అధికారులు... డీఎంకే మాజీ మంత్రి రంగనాథన్, సయ్యద్ ఇబ్రహీం, సెల్వం, సతీష్, మురళి, కుమార్ సహా 12 మందికి వ్యతిరేకంగా ప్రత్యేక న్యాయస్థానంలో చార్జిషీటు దాఖలు చేశారు. ఈ కేసు ఎంపీ, ఎమ్మెల్యేలపై నమోదైన కేసులు విచారించే ప్రత్యేక న్యాయస్థానంలో జరిగింది. ఈ కేసులో, ప్రభుత్వ తరఫున సాక్ష్యాలు నిరూపణ కాలేదని పేరొన్న న్యాయస్థానం, మాజీ ఎమ్మెల్యే రంగనాథన్‌ను విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీచేసింది. కాగా, ప్రస్తుతం రంగనాథన్ తమిళనాడు స్టోరేజ్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు.

వైద్య శిబిరానికి స్పందన

వేలూరు, ఫిబ్రవరి 26: స్థానిక కొసపేట తెన్న మఠం వీధిలోని శ్రీ ఆనంద ఆల్ట్రూ స్కాన్ సెంటర్‌లో సోమవారం నరాల వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో షుగర్, కాళ్ల నరాల పరీక్షలు, ఎముకల పటిష్ఠత తదితరాలపై పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యూరాలజిస్టు సంగీత జయరాం రోగులకు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ శిబిరంలో 300 మందికిపైగా వైద్యచికిత్సలందించినట్లు నిర్వాహకులు తెలిపారు.

ఆంధ్రావాసి అవయవదానం



సాముయేల్ సంపత్ (ఫైల్ ఫొటో)


వేలూరు, ఫిబ్రవరి 26: ఆంధ్ర రాష్ట్రం గుంటూరుకు చెందిన బతుల్లా సాముయేల్ సంపత్‌కుమార్ (39) తన ఇంట్లోని బాత్‌రూంలో కాలుజారి పడి గాయపడ్డారు. అతన్ని ఈనెల 22వ తేది వేలూరు సీఎంసీలో చికిత్స కోసం చేర్పించారు. ఈనెల 25వ తేది ఆయన మెదడు నిర్జీవమైనట్లు వైద్యులు గుర్తించారు. ఆయన అవయవాలు అందించేందుకు కుటుంబసభ్యులు అంగీకరించారు. ఆయన గుండెను చెన్నై ఎంఎంఎం ఆసుపత్రి, ఊపిరితిత్తులను చెన్నై కావేరి ఆసుపత్రి, ఎడమ కిడ్నీ రాణిపేట సీఎంసీ ఆసుపత్రికి, కుడి కుడ్నీ మేల్‌మరువత్తూర్ ఆదిపరాశక్తి మెడికల్ కాలేజీకి, రెండు కళ్లు వేలూరు సీఎంసీ ఆసుపత్రికి అందజేశారు. కాగా సంపత్‌కుమార్‌కు భార్య మేరి, కుమార్తె దీప్తి, కుమారుడు క్రిస్టోఫర్ ఉన్నారు.

నడిసముద్రంలో ఇరువర్గాల ఘర్షణ

- ఇద్దరు జాలర్ల మృతి, 8 మంది అరెస్ట్

ప్యారీస్, ఫిబ్రవరి 26: నాగపట్టినం సమీపంలోని నడి సముద్రంలో రెండు గ్రామాలకు చెందిన జాలర్ల మధ్య జరిగిన ఘర్షణలో ఇద్దరు మృతిచెందారు. ఈ దారుణాలకు పాల్పడిన 8 మంది జాలర్లను అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. సోమవారం ఉదయం జరిగిన ఈ సంఘటన జిల్లాలోని మత్స్యకారుల కుటుంబాలను ఆందోళనకు గురిచేసింది. నాగపట్టినం జిల్లా అక్కరపేటకు చెందిన శివలింగం కుమారులు ఆత్మనాథన్ (33), శివనేసెల్వం(25), కాలాస్తినాథన్(22) ఫైబర్ బోటులో నాగపట్టినం ఫిషింగ్ హార్బర్ నుంచి ఆదివారం సముద్రంలో చేపల వేటకు వెళ్లారు. వారు షిపింగ్ హార్బర్‌కు ఉత్తరంగా రెండు నాటికల్ మైళ్ల దూరంలో సోమవారం తెల్లవారుజామున సుమారు 2 గంటలకు చేపల వేటలో పాల్గొన్న సమయంలో, కీచంకుప్పం గ్రామానికి చెందిన 10 మంది జాలర్లు మర బోటులో అటుగా వెళ్లారు. ఫైబర్ పడవలో ఉన్న వల మర పడవలో చిక్కి తెగింది. దీంతో ఆగ్రహం చెందిన సోదరులు ఈ చర్యలకు పాల్పడిన జాలర్లతో వాగ్వాదానికి దిగారు. చివరకు మరబోటులో వచ్చిన జాలర్లు తమ పడవతో ఫైబర్ బోటును ఢీకొనడంతో ఆ పడవలో ఉన్న ముగ్గురు సోదరులు సముద్రంలో జారిపడ్డారు. ఈ నేపథ్యంలో, ఎడమ కన్ను, కుడి చేతి బలమైన గాయాలతో ప్రాణాలకు పోరాడుతూ సముద్రంలో ఈదుకుంటూ తీరానికి చేరుకున్న ఆత్మనాథన్, ఆ ప్రాంతంలో ఉన్న జాలర్లకు సంఘటన గురించి వివరించారు. దీంతో పడవల్లో సంఘటన జరిగిన ప్రాంతానికి వెళ్లిన జాలర్లు నీటిపై తేలియాడుతున్న శివనేసెల్వం, కాలాస్తినాథన్ మృతదేహాలను పడవలో ఎక్కించుకొని నాగపట్టినం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘర్షణలో తీవ్రంగా గాయపడి ఆత్మనాథన్ అత్యవసర చికిత్సా విభాగంలో చికిత్సలందుకుంటున్నాడు. ఈ ఘటనపై ఆత్మనాథన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు, విచారణ జరిపి కీచంకుప్పానికి చెందిన 8 మంది జాలర్లను కొడియకరై సమీపంలో చేపల వేటలో పాల్గొన్న సమయంలో అరెస్ట్ చేశారు. ఘర్షణ కారణంగా నాగపట్టినం జిల్లాలోని సముద్రతీర గ్రామాల్లో పోలీసుల భద్రత ఏర్పాటైంది. కీచంకుప్పం, అక్కరపేటల్లో జిల్లా ఎస్పీ ఉత్తర్వుల మేరకు పోలీసులు పెద్దసంఖ్యలో మోహరించారు.

మహిళల ఆరోగ్యంపై చర్చాగోష్టి



చర్చా కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

ప్యారీస్, ఫిబ్రవరి 26: ఆధునిక యుగంలో జీవితంలో ఎదురయ్యే సవాళ్ల నేపథ్యంలో, మహిళలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపించాల్సిన అవసరం ఉందని వక్తలు పేర్కొన్నారు. నగరంలోని క్లౌడ్ నైన్ ఆసుపత్రి ఆధ్వర్యంలో మహిళల వెల్‌నెస్ ఈవెంట్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. నగరానికి చెందిన 100 మందికి పైగా మహిళలకు ఆరోగ్యపరంగా సాధికారత కల్పించే విధంగా చర్చా గోష్టి ఏర్పాటు చేయగా, పలువురు నిపుణులు పాల్గొని సూచనలిచ్చారు. ఆరోగ్య శ్రేయస్సు, జీవితాల్లో సమతౌల్యం, మహిళలను శక్తివంతం చేయడంపై అవగాహన కల్పించారు. జీవితంలోని ప్రతి అంశాన్ని మహిళలు తీవ్రంగా పరిగణించాలని సలహాలిచ్చారు.

ప్రమాదంలో మాజీ ఎమ్మెల్యే మృతి



మాజీ ఎమ్మెల్యే రవికుమార్ (ఫైల్‌ఫొటో)

చెన్నై, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా మీంజూరు సమీపంలో సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో అన్నాడీఎంకే మాజీ శాసనసభ్యుడు రవికుమార్(63) మృతి చెందారు. పొన్నేరి సమీపం వెంబాక్కం వద్ద రవికుమార్, ఆయన భార్య నిర్మల నివసిస్తున్నారు. వీరి కుమార్తె చెన్నైలోని ఓ ప్రైవేటు కళాశాలలో వైద్య కోర్సు చదువుతోంది. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం కుమార్తెను కాలేజీలో విడిచి పెట్టి రవికుమార్, ఆయన భార్య నిర్మల స్వస్థలానికి బయలుదేరారు. కారును రవికుమార్ నడిపారు. ఆ కారు మీంజూరు - వండలూరు అవుటర్ రింగ్‌రోడ్డులో వెళ్తుండగా మీంజూరు సమీపం సీమాపురం టోల్‌గేట్ సమీపంలో అదుపుతప్పి రోడ్డు పక్కగా నిలిచి ఉన్న లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో రవికుమార్, ఆయన భార్య నిర్మల తీవ్రంగా గాయపడ్డారు. వారిని మీంజూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి రవికుమార్ మార్గమధ్యంలోనే మరణించినట్లు ధృవీకరించారు. నిర్మలకు ప్రాథమిక చికిత్స అనంతరం స్టాన్లీ ఆసుపత్రికి తరలించారు. రవికుమార్ 1991-96 వరకు పొన్నేరి ఎమ్మెల్యేగా వ్యవహరించారు. ఆయన సతీమణి నిర్మల కూడా దిండుగల్ ఎమ్మెల్యేగా పనిచేశారు. రవికుమార్ స్వస్థలం మనలి పుదునగర్ సమీపంలో ఉన్న నా.పాళయం. మూడు రోజులకు ముందు మాజీ ముఖ్యమంత్రి జయలలిత జయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. అదే ఆయన పాల్గొన్న చివరి పార్టీ కార్యక్రమం అని అన్నాడీఎంకే స్థానిక శాఖ నాయకులు తెలిపారు.

రహదారుల భద్రతపై అవగాహన



హెల్మెట్ ధరించిన వారికి పసుపు సంచుల అందజేత

వేలూరు, ఫిబ్రవరి 26: గుడియాత్తం ట్రాఫిక్ పోలీసు, వేలూరు నగర పోలీసు శాఖ సంయుక్త ఆధ్వర్యంలో రహదారుల భద్రతపై అవగాహన, పసుపు సంచుల పంపిణీ సోమవారం జరిగింది. గుడియాత్తం బస్టాండ్ సమీపంలో జరిగిన కార్యక్రమంలో ఏడీఎస్పీ రవిచంద్రన్ పాల్గొని, పర్యావరణంపై ప్రజలు అవగాహన కల్పించడంతో పాటు పసుపు సంచులు అందజేశారు. కార్యక్రమంలో ట్రాన్స్‌పోర్ట్ ఇన్‌స్పెక్టర్ ముఖేష్‌కుమార్, అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ రజని, సెంథిల్‌కుమార్, మురళి, నగర ఇన్‌స్పెక్టర్ పార్థసారథి, గుడియాత్తం నగర మండ్రం అధ్యక్షుడు సౌందర్‌రాజన్, యూనియన్ కమిటీ అధ్యక్షుడు సత్యానందం, ఆటో, బస్సు డ్రైవర్లు పాల్గొన్నారు.

లండన్‌లో తమిళ యువకుడి హత్య

ప్యారీస్, ఫిబ్రవరి 26: లండన్‌లో ఇటీవల మరణించిన తమిళనాడు యువకుడి మృతి కేసు మలుపుతిరిగింది. దీన్ని హత్య కేసుగా నమోదు చేసి 8 మందిని అరెస్ట్ చేశారు. కోయంబత్తూర్ మరుదుమలై ఐఏబీ కాలనీకి చెందిన పట్టాభిరామన్ కుమారుడు విఘ్నేష్ (36) ఖతార్‌లో పనిచేస్తూ ఏడాదిన్నర క్రితం లండన్ వెళ్లి అక్కడున్న ఓ ప్రైవేటు హోటల్‌లో పనిలో చేరాడు. ఈ నేపథ్యంలో, ఈనెల 14వ తేది హోటల్ నుంచి సైకిల్‌లో తన గదికి వెళుతుండగా విఘ్నేష్‌ను ఓ కారులో వెళ్లిన గుర్తుతెలియని వ్యక్తులు వేగంగా ఢీకొని పరారయ్యారు. తీవ్రంగా గాయపడిన విఘ్నేష్ చికిత్స ఫలించక మరణించాడు. ఈ ఘటనపై విచారణ జరిపిన లండన్ పోలీసులు ముందు ప్రమాదంగా భావించారు. అయితే విచారణలో ఇది హత్య అని తెలిసింది. ఈ కేసులో 8 మందిని అరెస్ట్ చేసిన లండన్ పోలీసులు, విఘ్నేష్ మృతదేహాన్ని భారతదేశానికి పంపించే ఏర్పాట్లు చేపట్టినట్లు మృతుడి కుటుంబసభ్యులు తెలిపారు.

చిన్నారులను బెదిరించి సెల్‌ఫోన్ లాక్కున్న రౌడీ అరెస్ట్

ప్యారీస్, ఫిబ్రవరి 26: స్థానిక మెరీనా బీచ్‌లో చిన్నారులను బెదిరించి సెల్‌ఫోన్ లాక్కున్న వీర అనే రౌడీని అరెస్ట్ చేశారు. ఓ చోరీ కేసులో అరెస్టయి జైలు నుంచి విడుదలైన మొదటి రోజే వీర మళ్లీ అదే చర్యలకు పాల్పడినట్లు పోలీసుల విచారణలో తెలిసింది. రాయపేటకు చెందిన కొందరు మిత్రులు మెరీనా బీచ్‌లో కూర్చొని మాట్లాడుతున్న సమయంలో అటుగా వెళ్లిన వీర, వారిపై దాడికి పాల్పడి ఇద్దరి వద్ద సెల్‌ఫోన్ లాక్కొనే ప్రయత్నం చేశారు. అయితే, అక్కడున్న కొందరు అతన్ని బంధించి మెరీనా పోలీసులకు అప్పగించారు.

లయన్స్ క్లబ్ వైద్యశిబిరం

వేలూరు, ఫిబ్రవరి 26: సీఎస్ఈ క్రైస్తవ నాథర్ ఆలయం (పీకే పురం) ఆలయ ప్రాంగణంలో వేలూరు హోంకేర్, లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని సమాజ సేవకుడు, కాంగ్రెస్ ఓబీసీ శాఖ వేలూరు మా నగర జిల్లా అధ్యక్షుడు నోబుల్ లివింగ్‌స్టన్ ప్రారంభించారు. కార్యక్రమంలో హోంకేర్ స్థాపకుడు ఆర్‌పీఎస్ జయచంద్రన్, సభ అశోక్, సతీష్‌కుమార్, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలు పరిష్కరించాలి

వేలూరు, ఫిబ్రవరి 26: స్థానిక కలెక్టర్ కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ జరిగింది. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి మాలతి పాల్గొని ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. వాటిని పరి ష్కరించాలంటూ సంబంధిత అధికారులను ఆమె ఆదేశించారు. ఈ శిబిరంలో రేషన్‌కార్డులు, పింఛన్లు, ఉచిత ఇళ్ల పట్టాలు అని 325 వినతిపత్రాలను ప్రజలు అందజేశారు. కార్యక్రమంలో దివ్యాంగుల సంక్షేమ శాఖ అధికారి శరవణన్, జిల్లా కలెక్టర్ సమూహ భద్రత అధికారి కలియమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంలో అవకతవకలకు అవకాశం లేదు

- కాంగ్రెస్ ఎంపీ కార్తీ చిదంబరం

ప్యారీస్, ఫిబ్రవరి 26: ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ (ఈవీఎం)లో తనకు తెలిసినంత వరకు అవకతవకలకు అవకాశం ఉండదని శివగంగ కాంగ్రెస్ ఎంపీ కార్తీ చిదంబరం పేర్కొన్నారు. శివగంగ సమీపంలో పొంచరంగాల్‌లో కొత్తగా నిర్మించిన పంచాయతీ కార్యాలయ భవన ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఆయన మీడియాతో మాట్లాడుతూ... ఈవీఎంలపై నమ్మకం ఏర్పడాలంటే అన్ని వీవీ ప్యాడ్ రసీదులు లెక్కించాలన్నారు. అయినా ఈ వ్యవహారంలో వెలువడుతున్న అభిప్రాయాలను తాను వ్యతిరేకించడం లేదన్నారు. రాష్ట్రంలో డీఎంకే నేతృత్వంలోని 'ఇండియా' కూటమి 39 మంది ఎంపీలున్నా, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పార్లమెంటులో ప్రస్తావించేందుకు ఎలాంటి అవకాశం కల్పించడం లేదన్నారు. పార్టీ నుంచి విజయధరణి వైదొలగడం బాధ కలిగిందని కార్తీ తెలిపారు.

ఏడు రోజుల తర్వాత...

చేపలవేటకు బయల్దేరిన రామేశ్వరం జాలర్లు



రామేశ్వరం రేవు నుంచి పడవల్లో వెళ్తున్న జాలర్లు

చెన్నై, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): వారం రోజులపాటు సమ్మెలో పాల్గొన్న రామేశ్వరం జాలర్లు సోమవారం ఉదయం నుంచి వేటను ప్రారంభించారు. తమిళ జాలర్లపై శ్రీలంక నావికాదళం జరుపుతున్న దాడులు, అక్రమ నిర్బంధాలను ఖండిస్తూ, ఇటీవల నలుగురు జాలర్లకు జైలు శిక్ష విధించడాన్ని నిరసిస్తూ రామేశ్వరం జాలర్ల సంఘం ఆధ్వర్యంలో జాలర్లు నిరవధిక సమ్మెకు దిగారు. రెండు రోజులుగా నిరాహార దీక్షను కూడా చేపట్టారు. ఈ నేపథ్యంలో రామనాథపురం శాసనసభ్యుడు ఖాదర్‌బాషా, స్థానిక నాయకుడు ముత్తురామలింగంతో కలిసి ఆందోళన చేస్తున్న జాలర్లతో చర్చలు జరిపారు. శ్రీలంక జైలులో ఉన్న జాలర్లను విడిపించేందుకు కేంద్రప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, అదే సమయంలో తమిళ జాలర్లకు జైలు శిక్షపడేలా సవరించి శ్రీలంక చట్ట సవరణను రద్దు చేయించడానికి కూడా చర్యలు చేపడుతుందని పేర్కొన్నారు. దీంతో జాలర్లు ఆందోళనను విరమించారు. సోమవారం ఉదయం రామేశ్వరం రేవు నుంచి జాలర్లు చేపలవేటకు బయలుదేరారు.

15వ శతాబ్దంనాటి విగ్రహం లభ్యం



విల్‌వీరన్ విగ్రహం

ఐసిఎఫ్, ఫిబ్రవరి 26: కాంచీపురం యూనియన్ గోనికుప్పం పంచాయతీ ఇంద్రా నగర్‌లో 15వ శతాబ్దానికి చెందిన విల్‌వీరన్ విగ్రహం బయల్పడిం ది. కాంచీపురం శంకర ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల తమిళ శాఖ సహాయ ప్రొఫెసర్ అన్బళగన్ ఆధ్వర్యంలో ఎంఏ విద్యార్థుల బృందం ఈ ప్రాంతంలో పరిశోధనలు చేపట్టింది. భూమి నుంచి 50 సెం.మీ మాత్రమే తెలుస్తున్న ఓ విగ్రహాన్ని గుర్తించి వెలికితీశారు. 174 సెం.మీ ఎత్తు, 50 సెం.మీ ముందు భాగం వెడల్పు, 20 సెం.మీ పక్క భాగం వెడల్పు కలిగి ఉన్న ఈ విగ్రహం పీఠం 64 సెం.మీ ఉంది. వీరుడి చేతిలో బాణం ఉండగా, ఓ చేయి మణికట్టు విరిగి ఉంది. మెడ, భుజానికి ఆభరణాలు ధరించినట్లుంది. ఎలాంటి లిపి లేని ఈ విగ్రహం 15, 16వ శతాబ్దానికి చెంది ఉంటుందని పరిశోధకులు వివరించారు.

17 ప్రాంతాల్లో కార్చిచ్చు

పెరంబూర్, ఫిబ్రవరి 26: రాష్ట్రంలో ఆదివారం ఒకే రోజు ఏడు జిల్లాల్లోని 17 ప్రాంతాల్లో కార్చిచ్చు ఏర్పడింది. కృష్ణగిరి జిల్లాలో నాలుగు, విల్లుపురం, వేలూరు జిల్లాలో తలా మూడు, తిరువళ్లూర్, తేని, సేలం జిల్లాల్లో తలా రెండు, తిరుచ్చిలో ఒక ప్రాంతంలో కార్చిచ్చు సంభవించింది. అటవీ పరిశోధకులు అందించిన సమాచారంతో మంటలు అదుపుచేసే చర్యలు చేపట్టినట్లు అటవీ శాఖ అధికారులు తెలిపారు.

అన్నామలై కేసు విచారణకు స్టే

పెరంబూర్, ఫిబ్రవరి 26: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలైపై ఉన్న కేసు విచారణకు సుప్రీంకోర్టు స్టే విధించింది. ఇరుమతాల మధ్య విబేధాలు సృష్టించేలా మాట్లాడుతన్నారనే ఫిర్యాదుతో అన్నామలైపై కేసు నమోదు కాగా, మద్రాసు హైకోర్టులో ప్రస్తుతం విచారణ జరుగుతోంది.

ఉదయనిధి కౌంటర్ కేసులో ఈపీఎస్‌కు నోటీసు

పెరంబూర్, ఫిబ్రవరి 26: అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, ప్రతిపక్ష నేత ఎడప్పాడి పళనిస్వామి తనపై వేసిన పరువునష్టం కేసును కొట్టివేయాలని మంత్రి ఉదయనిధి స్టాలిన్ కౌంటర్ పిటిషన్ దాఖలు చేశారు. సోమవారం ఈ పిటిషన్ విచారించిన మద్రాసు హైకోర్టు, మంత్రి ఉదయనిధి పిటిషన్‌పై స్పందించాలని పళనిస్వామికి నోటీసు జారీచేసింది.

సాత్తూర్ బాణసంచా కర్మాగారం పేలుడు

- 11కు పెరిగిన మృతుల సంఖ్య

పెరంబూర్, ఫిబ్రవరి 26: విరుదునగర్ జిల్లా సాత్తూర్ సమీపంలోని ఉన్న బాణసంచా తయారీ కర్మాగారంలో జరిగిన పేలుడులో మృతుల సంఖ్య 11కు పెరిగింది. ఈ నెల 17వ తేది రాముదేవన్‌పట్టిలోని ఈ కర్మాగారంలో జరిగిన పేలుడులో 10 మంది సంఘటనా స్థలంలోనే మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో గాయపడి విరుదునగర్ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న రంగమ్మాళ్ (55) సోమవారం మృతిచెందింది.

గంజాయితో యువకుడి అరెస్ట్

వేలూరు, ఫిబ్రవరి 26: స్థానిక కాట్పాడి పోలీస్‌స్టేషన్ పరిధిలో తరచూ ఆంధ్ర నుంచి గంజాయి తీసుకొచ్చి ఈ ప్రాంతంలో విక్రయిస్తున్నట్లు పోలీసులకు ఫిర్యాదులందాయి. దీంతో కాట్పాడి డివిజన్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ తమిళ్‌సెల్వన్ నేతృత్వంలో ఎస్ఐ మణికంఠన్ సహా సిబ్బంది కాట్పాడిలోని ఓ వర్శిటీ గేటు ఎదురుగా వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో అటుగా వచ్చిన యువకుడిని అదుపులోకి తీసుకొని విచారించగా, కాట్పాడి పెరియపుదూర్ కాలనీకి చెందిన పూవేందన్ అలియాస్ అప్పు అని ఆంధ్ర నుంచి గంజాయి తీసుకొస్తున్నట్లు తెలిసింది. దీంతో గంజాయి స్వాధీనం చేసుకున్న పోలీసులు అతడిని కోర్టులో హాజరుపరచి జైలుకు తరలించారు.

అరక్కోణం వద్ద సిగ్నల్‌లో సమస్య

- మార్గమధ్యంలో నిలిచిపోయిన రైళ్లు
- వందే భారత్ ఎక్స్‌ప్రెస్ కూడా

అడయార్, ఫిబ్రవరి 26: అరక్కోణం సమీపంలో సోమవారం రైల్వే సిగ్నల్‌లో సాంకేతిక సమస్య ఉత్పన్నమైంది. దీంతో మార్గమధ్యంలోనే వందే భారత్ సహా పలు రైళ్లు నిలిచిపోయాయి. రాణిపేట జిల్లా అరక్కోణం జంక్షన్ మీదుగా కర్ణాటక, కేరళ రాష్ట్రాలకు వెళ్లే రైళ్లు, ఎక్స్‌ప్రెస్‌లు ఈ మార్గం మీదుగానే రాకపోకలు సాగిస్తుంటాయి. అయితే, సోమవారం ఉదయం 6.45 గటలకు కాట్పాడికి వెళ్లే రైలు మార్గంలో ఉన్నట్టుండి సిగ్నళ్లు పనిచేయలేదు. సమాచారం అందుకున్న అరక్కోణం రైల్వే స్టేషన్ సాంకేతిక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మరమ్మతులు చేట్టారు. సుమారుగా గంట పాటు ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు.

సన్నిహితంగా ఉన్న వీడియో లీక్ చేస్తానన్న నవ వరుడి హత్య

అడయార్, ఫిబ్రవరి 26: కట్టుకున్న భార్యతో పడక గదిలో సన్నిహితంగా ఉన్నపుడు రహస్యంగా తీసిని వీడియో బహిర్గతం చేస్తానంటూ బెదిరించిన వరుడిని వధువు బంధువులు హత్య చేశారు. సేలం జిల్లాలో జరిగిన ఈ హత్యకు సంబంధించి పోలీసుల కథనం మేరకు... సేలం న్యూ తిరుచ్చి మెయిన్ రోడ్డుకు చెందిన ముబారక్ (22) తనతో కలిసి చదువుకుని ఓ కంపెనీలో పనిచేసే షాజిని (22) పది రోజుల క్రితం వివాహం చేసుకున్నాడు. భర్తతో మనస్పర్థలు రావడంతో షాజిని పుట్టింటికి వెళ్లిపోయింది. అయితే, ముబారక్ తన భార్యకు ఫోన్ చేసి, కాపురానికి రాకపోతే రహస్యంగా తీసిన వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేస్తానని బెదిరించాడు. దీంతో భయపడిన షాజిని... ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు చెప్పింది. మాట్లాడేందుకు రావాలంటూ ముబారక్‌ను పిలిచినా ఆయన వెళ్లలేదు. ఈ నేపథ్యంలో ముబారక్ ఒంటరిగా ఆంబూరు వెళ్లి సేలంకు తిరిగి వస్తున్నట్టు తెలుసుకుని, కాపుకాసి గొంతుపిసికి చంపేశారు. ఎవరికీ అనుమానం రాకుండా మృతదేహాన్ని రైలు పట్టాలపై పడేశారు. అయితే, పోలీసుల విచారణలో ముబారక్ హత్యకు గురైనట్టు తేలింది. దీంతో షాజిని బంధువులు ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నారు.

పాలారు చెక్ డ్యాంపై న్యాయపోరాటం: వైగో

అడయార్, ఫిబ్రవరి 26: చిత్తూరు జిల్లా కుప్పంలో పాలారుపై ఏపీ ప్రభుత్వం చెక్ డ్యాం నిర్మించాలన్న నిర్ణయానికి వ్యతిరేకంగా రాష్ట్రప్రభుత్వం న్యాయపోరాటం చేయాలని ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి వైగో కోరారు. ఇదే విషయంపై ఆయన సోమవారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. కుప్పంలో పాలారు నదిపై చెక్ డ్యాంలు నిర్మించి, రెండు చోట్ల నీటి నిల్వ కేంద్రాలను నిర్మించేందుకు ఏపీ ప్రభుత్వ సన్నాహాలు చేపట్టింది. ఈ విషయం తెలుసుకున్న వైగో.. రాష్ట్ర ప్రభుత్వాన్ని అప్రమత్తం చేశారు. పాలారు నదిపై ఏపీ ప్రభుత్వం చెక్ డ్యాంలు నిర్మించకుండా మద్రాస్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయాలని కోరారు.

ఆ రెండు పార్టీల నుంచి ఆహ్వానాలు

- శరత్‌కుమార్ వెల్లడి

అడయార్, ఫిబ్రవరి 26: పార్లమెంట్ ఎన్నికల్లో కలిసి పోటీ చేసేందుకు అన్నాడీఎంకే, బీజేపీ నుంచి ఆహ్వానాలు వస్తున్నాయని సమత్తువ మక్కల్ కట్చి ప్రధాన కార్యదర్శి, సినీ హీరో శరత్ కుమార్ తెలిపారు. ఆయన సోమవారం నెల్లైలో విలేకరులతో మాట్లాడుతూ.. రెండు పార్టీల నుంచి ఆహ్వానాలు వస్తున్నప్పటికీ ఏ పార్టీతో పొత్తు అన్న విషయంపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని, తాను నెల్లై నుంచి పోటీ చేయాలా వద్దా అన్నది తన సొంత నిర్ణయమన్నారు. తమకు సానుకూలంగా ఉన్న పార్టీతో కలిసి ముందుకు వెళతామన్నారు.

విలవంగోడు నియోజకవర్గం ఖాళీ

- ఈసీకి అసెంబ్లీ కార్యదర్శి లేఖ

పెరంబూర్, ఫిబ్రవరి 26: విజయధరణి రాజీనామాతో విలవంగోడు శాసనసభ నియోజకవర్గం ఖాళీ అయినట్లు ఎన్నికల కమిషన్‌కు అసెంబ్లీ కార్యదర్శి లేఖ రాశారు. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యే విజయధరణి గత శనివారం డిల్లీలో బీజేపీ అధిష్ఠానాన్ని సంప్రదించి ఆ పార్టీలో చేరారు. అనంతరం స్పీకర్ అప్పావుకు తన రాజీనామా లేఖ పంపారు. తాను నా ఎమ్మెల్యే పదవికి ఫిబ్రవరి 24వ తేది నుంచి రాజీనామా చేస్తున్నానంటూ విజయధరణి పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో, తిరునల్వేలిలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న స్పీకర్ అప్పావు.. రాజీనామాను ఆమోదించినట్లు, ఆ విషయాన్ని ఎన్నికల కమిషన్‌కు తెలియజేయనున్నామని తెలిపారు. ఎన్నికల కమిషన్‌కు లేఖ అందితే, విలవంగోడు శాసనసభ నియోజకవర్గం ఖాళీగా ఉన్నట్లు ప్రకటిస్తారు. నియోజకవర్గం ఖాళీ అని ఈసీ ప్రకటిస్తే, ఆ నియోజకవర్గానికి ఆరు నెలల్లో ఉపఎన్నిక నిర్వహించాల్సి ఉంది. ఏమైనా, రాబోయే పార్లమెంటు ఎన్నికలతో పాటు విలయంగోడు శాసనసభ ఎన్నిక జరిగే అవకాశం ఉంది. అలా జరిగితే, పార్లమెంటు ఎన్నికల నోటిఫికేషన్ రోజునే విలవంగోడు నియోజకవర్గ ఉప ఎన్నిక నోటిఫికేషన్ కూడా విడుదల కానుంది. అలాగే, తిరుక్కోవిలూర్ నియోజకవర్గం ఖాళీగా ప్రకటించాలా అనే అంశం స్పీకర్ పరిశీలనలో ఉందని అసెంబ్లీ కార్యదర్శి లేఖలో పేర్కొన్నారు.

విజయ గార్డెన్స్‌లోనే సినీ జీవితం ప్రారంభించా

● నిర్మాత చదలవాడ శ్రీనివాసరావు

తన సినీ జీవితం చెన్నైలోని విజయా గార్డెన్స్‌లోనే ప్రారంభమైందని నిర్మాత, దర్శకుడు చదలవాడ శ్రీనివాసరావు తెలిపారు. సీనియర్ నటి జయసుధ కుమారుడు నిహార్ - నాగార్జున హీరోలుగా నటించిన చిత్రం 'రికార్డ్ బ్రేక్'. తమిళం, తెలుగుతో పాటు పలు భాషల్లో తెరకెక్కగా, మార్చి 8న విడుదలకానుంది. చదలవాడ శ్రీనివాసరావు సొంతంగా నిర్మించి దర్శకత్వం వహించారు. ఈ చిత్రం ట్రైలర్, ఆడియో రిలీజ్ వేడుక తాజాగా నగరంలో జరిగింది. శ్రీ తిరుమల తిరుపతి వేంకటేశ్వ ఫిలిమ్స్ బ్యానరుపై తెరకెక్కింది. రగ్ధ ఇఫ్తీకర్ హీరోయిన్. ఈ ట్రైలర్ రిలీజ్ వేడుకలో నిర్మాత చదలవాడ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. 'అనాథ అయిన హీరో బాల్యం నుంచే అన్ని రకాల పనులు చేసుకుంటూ జీవిస్తుంటాడు. పెరిగి పెద్దయిన తర్వాత ఒక క్రీడకు బానిస అవుతాడు. ఆ తర్వాత ఏం జరిగిందన్నదే ఈ చిత్ర కథ. ఈ సినిమా కథపై నాకు గట్టి నమ్మకం ఉంది. సినిమా చూస్తే మీకే అర్థమవుతుంది. ఒక మంచి సందేశంతో చిత్రాన్ని నాకు ఎంతో ఇష్టమైన తమిళ ప్రేక్షకుల చెంతకు తీసుకుని రావడం ఎంతో సంతోషంగా ఉంది. సినిమాలో అంతర్లీనంగా ఎమోషనల్ పాయింట్ ఉంది. సినిమా రిలీజ్ తర్వాత ఆ పాయింట్ గురించి ప్రతి ఒక్కరూ చర్చించుకుంటారు' అని అన్నారు. హీరో నిహార్ మాట్లాడుతూ... 'ఇది నా రెండో సినిమా. గత ఐదేళ్లుగా ఈ సినిమా కోసం ఎంతో శ్రమించాం. వీఎఫ్ఎక్స్ సన్నివేశాలు బాగా వచ్చాయి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రేక్షకులు ఈ సినిమాను చూడాలి. అందుకే తమిళం, తెలుగుతో పాటు ఎనిమిది భాషల్లో విడుదల చేస్తున్నాం. ఎవరూ లేనివారికి ఒక అవకాశం ఇస్తే వారు ఎన్నో సాధిస్తారన్న ఒక సందేశం ఈ మూవీలో చెప్పాం' అన్నారు. మరో హీరో నాగార్జున, హీరోయిన్ రగ్ధ ఇఫ్తీకర్, సత్యకృష్ణన్, సోనియా, సీనియర్ నిర్మాత కాట్రగడ్డ ప్రసాద్ తదితరులు ప్రసంగించారు.


విలేకరుల సమావేశంలో 'రికార్డ్‌బ్రేక్' చిత్ర బృందం

రచయిత జయమోహన్ కుమారుడి వివాహ రిసెప్షన్


వధూవరులను ఆశీర్వదిస్తున్న శంకర్

● తరలి వచ్చిన తారాలోకం

ప్రముఖ సినీ రచయిత జయమోహన్ - అరుణ్‌మొళి నంగై దంపతుల కుమారుడు అజిత్ కుమారుడి వివాహ రిసెప్షన్ చెన్నైలో జరిగింది. ఈ వేడుకకు చిత్రపరిశ్రమకు చెందిన ప్రముఖులు తరలివచ్చి వధూవరులను ఆశీర్వదించారు. అజిత్‌కు కోయంబత్తూరుకు చెందిన మీనాక్షితో

చిత్రజ్యోతి

తాజాగా వివాహం జరుగ్గా, రిసెప్షన్ శనివారం రాత్రి ఘనంగా జరిగింది. శివకుమార్, విజయ్ సేతుపతి, కుమారవేల్, దర్శకులు మణిరత్నం, శంకర్, బాలా, వసంత్, ఏఆర్ మురుగదాస్, గౌతం వాసుదేవ్ మీనన్, లింగుస్వామి, వసంత్‌బాలన్, మిష్కిన్, శీను రామస్వామి, సుబ్రమణ్య శివ, మిత్రన్ జవహర్‌తో పాటు అనేక మంది హాజరై వధూవరులను ఆశీర్వదించారు. తమిళ చిత్రపరిశ్రమలో ప్రముఖ రచయితగా గుర్తింపు పొందిన జయమోహన్ అనేక నవలలు , షార్ట్‌స్టోరీస్, రాజకీయం, ఆధ్యాత్మికం ఇలా 150కు పైగా రచనలు చేశారు. అలాగే, వరుడు అజిత్ కూడా తండ్రి అడుగుజాడల్లో నడుస్తూ రచయితగా, అసిస్టెంట్ డైరెక్టరుగా కొనసాగుతున్నారు.

కల నిజమైన తరుణం



● అపర్ణ బాలమురళి

ఒక అభిమానిగా ఉన్న తాను హీరో ధనుష్ కథానాయకుడిగా నటిస్తూ, దర్శకత్వం వహిస్తున్న 'డి50'లో భాగస్వామి కావడంతో తన కల నిజమైందని హీరోయిన్ అపర్ణ బాలమురళి అన్నారు. ధనుష్ నటిస్తున్న 50వ చిత్రం 'రాయన్'. ఏ.ఆర్. రెహ్మాన్ సంగీతం అందించే ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాత కళానిధి మారన్ సన్ పిక్చర్స్ బ్యానరుపై తెరకెక్కించారు. ఇందులో ఎస్‌జే సూర్య, ప్రకాష్‌రాజ్, దర్శకుడు సెల్వరాఘవన్, దుషారా విజయన్ తదితరులు కీలక పాత్రలను పోషిస్తున్నారు. తాజాగా 'సూరరైపోట్రు' ఫేం అపర్ణ బాలమురళిని తీసుకున్నారు. 'రాయన్' చిత్రంలో తనకు అవకాశం ఇవ్వడంపై ఆమె స్పందిస్తూ, "రాయన్' చిత్రంలో భాగస్వామి కావడానికి నాకు అవకాశం ఇచ్చిన ధనుష్‌కు కృతజ్ఞతలు. ఒక అభిమానిగా మీతో కలిసి పని చేయడం నా కల నిజమైన తరుణం ఇది. మీరే మాకు స్ఫూర్తి. ఇది నిజంగానే స్పెషల్ అని పేర్కొన్నారు.

సినీ నటీనటులు సేవా భావంతో మెలగాలి


అవార్డు గ్రహీతలతో మాజీ జడ్జి కృష్ణన్ తదితరులు

● రిటైర్డ్ జడ్జి ఎస్.కృష్ణన్

బుల్లితెర, బిగ్ స్క్రీన్‌కు చెందిన సినీ నటులు సేవా భావంతో మెలుగుతూ, తమ వృత్తిలో రాణిస్తూ సమాజ సేవ చేయాలని మద్రాస్ హైకోర్టు మాజీ న్యాయమూర్తి ఎస్.కృష్ణన్ పిలుపునిచ్చారు. మహా ఫైన్ ఆర్ట్స్ ఫౌండర్ అనురాధ జయరామ్, యునైటెడ్ ఆర్టిస్ట్స్ ఆఫ్ ఇండియా చైర్మన్ నెల్లై సౌందర రాజన్ సంయుక్తంగా స్థానిక వడపళనిలోని శిఖరం హాలులో నిర్వహించిన ఓ కార్యక్రమంలో పలువురు సినీ నటీనటులకు సేవా అవార్డులను ప్రదానం చేశారు. ఇందులో బెస్ట్ యాక్టర్ స్పెషల్ అవార్డును సుగన్ చక్రవర్తి, ఉత్తమ క్యారెక్టర్ నటి అవార్డును అహల్యా సారో, బెస్ట్ టీవీ నటి ప్రత్యేక అవార్డును తిలక్ శ్రీను, బెస్ట్ న్యూ ఫేస్ ప్రత్యేక అవార్డును సద్నా శంకర్‌కు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మాజీ న్యాయమూర్తి కృష్ణన్ మాట్లాడుతూ, 'సమాజ శ్రేస్సు కోసం ప్రతి ఒక్కరూ సేవా భావంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. తమ వృత్తిలో రాణిస్తూనూ సమాజానికి తమకు తోచిన విధంగా సాయం చేయాలని ఆయన కోరారు.

8న క్రెడాయ్ 'ఫెయిర్ ప్రో 2024'



వివరాలు వెల్లడిస్తున్న ఎస్.శివగురునాథన్, రవిరంజన్, సుహాసినీ మణిరత్నం తదితరులు

చెన్నై, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): కాన్ఫెడరేషన్ ఆఫ్ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ అసోసియేషన్స్ ఆఫ్ ఇండియా (క్రెడాయ్, చెన్నై చాప్టర్) ఆధ్వర్యంలో మార్చి 8 నుంచి 10వ తేదీ వరకు నందంబాక్కం ట్రేడ్‌సెంటర్‌లో 'ఫెయిర్‌ప్రో 2024' పేరుతో భారీ ఎగ్జిబిషన్‌ను నిర్వహించనున్నట్లు సంస్థ అధ్యక్షుడు ఎస్.శివగురునాథన్ తెలిపారు. నగరంలో సోమవారం ఉదయం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... మూడు రోజులపాటు నిర్వహించనున్న ఎగ్జిబిషన్‌లో వివిధ రియల్‌ఎస్టేట్ సంస్థలకు చెందిన 200 భవననిర్మాణ ప్రాజెక్టులకు సంబంధించిన స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అన్ని వర్గాలకు అందుబాటులో ఉన్న ధరలకు గృహ సముదాయాల వివరాలను తెలుసుకునే వీలుంటుందన్నారు. గృహాలను కొనుగోలు చేయడానికి అనువుగా ఎస్‌బీఐ, యాక్సిస్ బ్యాంక్, కెనరాబ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ, ఇండియన్ బ్యాంక్, ఎల్‌ఐసీహెచ్‌ఎఫ్‌ఎల్, టాటా కేపిటల్ నుంచి రుణాలు పొందటానికి మార్చి 1నుంచి 3వ తేదీ వరకు టి.నగర్ విజయమహల్‌లో గృహ రుణ మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. రుణమేళాలో ఏ మేరకు గృహ నిర్మాణ రుణాలు లభిస్తాయో తెలుసుకుని, ఆ మేరకు ఫెయిర్‌ప్రోలో తమకు నచ్చిన ఫ్లాట్లను కొనుగోలు చేసుకోవచ్చునని వివరించారు. ఇక ట్రేడ్‌సెంటర్‌లో ఏర్పాటయ్యే ప్రదర్శనను బ్రాండ్ అంబాసిడర్లుగా వ్యవహరిస్తున్న నటీమణులు సుహాసినీ మణిరత్నం, ప్రియా భవానీశంకర్ ప్రారంభించనున్నారని తెలిపారు. సమావేశంలో ఫెయిర్‌ప్రో 2024 కన్వీనర్ అస్లం ఫకీర్ మహమ్మద్, కార్యదర్శి పి. కృతివాస్, ఎస్‌బీఐ చీఫ్ జనరల్ మేనేజర్ రవిరంజన్, నటి సుహాసినీ మణిరత్నం తదితరులు పాల్గొన్నారు.

పరిశోధనలపై విశ్వవిద్యాలయాలు దృష్టిసారించాలి

● ఎస్ఆర్ఎం వర్శిటీ ఛాన్సలర్ పారివేందర్ పిలుపు

చెన్నై, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): విశ్వవిద్యాలయాలు విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పి, వారికి పట్టాలను ప్రదానం చేయడంతోనే సరిపెట్టుకోకుండా పరిశోధనలపై దృష్టి సారించేలా వారిలో ప్రతిభాపాటవాలను పెంపొందింపజేయాలని ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయం వ్యవస్థాపక ఛాన్సలర్ డాక్టర్ టీఆర్ పారివేందర్ పిలుపునిచ్చారు. సోమవారం ఉదయం ఆ విశ్వవిద్యాలయంలోని టీపీ గణేశన్ ఆడిటోరియంలో ఏఎఫ్ఎండీ 2024 అనే పేరుతో అత్యంత ఆధునిక వస్తువులు పరికరాలపై నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో ప్రసంగించారు. నేషనల్ క్లినికల్ లేబొరేటరీ, కౌన్సిల్ ఫర్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రిసెర్చ్ డైరెక్టర్ డాక్టర్ ఆశిష్ లీలే ప్రారంభోపన్యాసం చేశారు. రాతియుగం, లోహయుగంలో మానవజాతి తన అవసరాలకు వివిధ రకాల పనిముట్లను తయారు చేసుకుందన్నారు. భవిష్యత్తులో నానో టెక్నాలజీ ప్రధాన పాత్రను పోషించనుందని చెప్పారు. ఈనెల 28న జాతీయ వైజ్ఞానిక దినోత్సవం సందర్భంగా కొచ్చిన్ ఓడరేవులో హైడ్రోజన్ ఇంధనంగా పనిచేసే ప్రోటోటైప్ బల్లకట్టును ఆవిష్కరించనున్నామని చెప్పారు. వైస్‌ఛాన్సలర్ సి.ముత్తుసెల్వన్, సదస్సు కన్వీనర్ డాక్టర్ ఎం.నవనీతన్, ఐయూఏసీ (న్యూఢిల్లీ) మాజీ డైరెక్టర్ డాక్టర్ దినకర్ కాంజిలాల్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎస్.పొన్నుసామి తదితరులు పాల్గొన్నారు.


సదస్సులో పాల్గొన్న ఎస్ఆర్ఎం వర్శిటీ వ్యవస్థాపక ఛాన్సలర్ టీఆర్ పారివేందర్, వైస్‌ఛాన్సలర్ ముత్తుతమిళ్‌సెల్వన్


సమావేశంలో అన్నామలై, జీకే వాసన్

మాకు మార్గదర్శకుడు జీకే వాసన్

● బలమైన కూటమికి తొలి అడుగు

● బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై

పెరంబూర్, ఫిబ్రవరి 26: బీజేపీ కూటమిలో జీకే వాసన్ తొలి అడుగు వేశారని, రానున్న 100 రోజులు తమకు మార్గదర్శకం చూపే వ్యక్తిగా ఉంటారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై తెలిపారు. బీజేపీతో తమిళ మానిల కాంగ్రెస్ (టీఎంసీ) పొత్తు సోమవారం ఉదయం ఖరారైంది. ఈ నేపథ్యంలో జీకే వాసన్, అన్నామలై సంయుక్తంగా విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నామలై మాట్లాడుతూ... రాష్ట్రంలో బీజేపీ కూటమిలో తొలిపార్టీగా టీఎంసీ జతకట్టిందన్నారు. టీఎంసీకి ప్రత్యేక గౌరవం ఉందని, ప్రధాని మోదీని విడిచి వారు ఎన్నడూ వెళ్లలేదన్నారు. రాష్ట్రంలో ఆది నుంచి ప్రధాని మోదీకి మద్దతుగా గళం విప్పిన వ్యక్తి వాసన్ అన్నారు. భారీ మార్పులకు ఈరోజు నాంది పడిందని, 2024, 2026 ఎన్నికల్లో మార్పులు చూస్తారన్నారు. బలమైన కూటమి ఏర్పాటు చేయాలనేదే తమ లక్ష్యమన్నారు. మూడోసారి మోదీ నేతృత్వంలో బీజేపీ ప్రభుత్వ ఏర్పాటుకు బలమైన కూటమిగా మారాల్సి ఉందన్నారు. తాము అమలు చేసిన పథకాలు చెప్పి ఓట్లు అడిగే పరిస్థితులు డీఎంకేకు లేవన్నారు. 2024 ఎన్నికల్లో బీజేపీ ఉన్న వ్యతిరేకత బద్దలవుతుందన్నారు.

పంచాయతీ అధ్యక్షురాలికి గుర్రం బహుమతి


కోకిలకు గుర్రం అందజేస్తున్న గ్రామస్తులు

పెరంబూర్, ఫిబ్రవరి 26: రామనాథపురం జిల్లా తిరుబువని సమీపం తాతనేందల్ పంచాయతీ అధ్యక్షురాలి సేవలు ప్రశంసిస్తూ గ్రామస్తులు ఆమెకు గుర్రాన్ని బహుమతిగా అందజేశారు. ఈ పంచాయతీ అధ్యక్షురాలు కోకిల... 10 వేలకు పైగా మొక్కలు నాటారు. అలాగే, ఉద్యానవనాన్ని ఏర్పాటుచేసి పర్యవేక్షిస్తున్నారు. ఈ చర్యలతో ఆమె 9 అవార్డులు పొందారు. ఆమె సేవలు అభినందించేలా గ్రామస్తులు ఆదివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి, రూ.2.50 లక్షల విలువైన గుర్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో భాగంగా 100 మంది ఉపాధి హామీ కార్మికులు, పారిశుధ్య కార్మికులు, పంచాయతీ సిబ్బందిని గ్రామపెద్దలు సత్కరించారు. అలాగే, మారథాన్ పోటీలు నిర్వహించి ప్రథమ బహుమతిగా రూ.5,000, రెండో బహుమతిగా రూ.3,000 అందజేయడంతో పాటు ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు.

పరందూర్ విమానాశ్రయాన్ని వ్యతిరేకిస్తూ ఆందోళనలు


రాస్తారోకోలో రైతులు

● 150 మంది రైతుల అరెస్ట్

పెరంబూర్, ఫిబ్రవరి 26: పరందూర్ విమానాశ్రయ ఏర్పాటును నిరసిస్తూ ఆందోళన చేపట్టిన రైతులు, గ్రామస్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. కాంచీపురం జిల్లా పరందూర్ పరిసర ప్రాంతాల్లో రెండో విమానాశ్రయం ఏర్పాటుకు కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు చర్యలు చేపట్టాయి. ఈ నేపథ్యంలో, కాంచీపురం తాలూకాలోని పొడవూరులో భూసేకరణ ప్రకటన వెలువడింది. అభ్యంతరాలుంటే 30 రోజుల్లో తెలియజేయాలని, ఏప్రిల్ 4వ తేది విచారణ చేపడతామని భూసేకరణ జిల్లా రెవెన్యూ అధికారి ప్రకటన వెలువడింది. ఈ నేపథ్యంలో, పరందూర్ విమానాశ్రయాన్ని వ్యతిరేకిస్తూ ఆందోళన చేపడుతున్న రైతులు, గ్రామస్తులు ప్రభుత్వ ప్రకటనతో దిగ్భ్రాంతి చెందారు. ప్రభుత్వ ప్రకటనను ఖండిస్తూ సోమవారం ఏకనాపురం నుంచి భూసేకరణ రెవెన్యూ అధికారి కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించాలని నిర్ణయించారు. ఈ ర్యాలీకి పోలీసులు అనుమతివ్వలేదు. అయినా రైతులు, గ్రామస్తులు ట్రాక్టర్ల ద్వారా కార్యాలయానికి బయల్దేరారు. వీరిని పోలీసులు మధ్యలోనే అడ్డుకున్నారు. దీంతో, పోలీసులతో వాగ్వాదానికి దిగిన రైతులు రోడ్డుపై ఆందోళన చేపట్టారు. దీంతో, సుమారు 150 రైతులు, గ్రామస్తులను పోలీసులు వాహనాల్లో తరలించారు. వారందర్నీ సుంగువాసత్రంలోని కల్యాణ మండపానికి తరలించి, అక్కడ వారు నిరాహారదీక్ష చేపట్టి ఆందోళన కొనసాగించారు.

ఫీనిక్స్ మార్కెట్ సిటీలో చెఫ్ పూజా ధింగ్రా

చెన్నై, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక వేళచ్చేరిలోని ఫినిక్స్ మార్కెట్ సిటీలో ప్రముఖ చెఫ్ పూజా ధింగ్రా హల్‌చల్ చేశారు. అక్కడున్న వినియోగదారులకు పాకశాస్త్రంపై క్లాస్ తీసుకున్నారు. ఈ కార్యక్రమం ఆహార ప్రియులను, ఔత్సాహిక చెఫ్‌లను పరవశింపజేసింది. దీనిపై ఫీనిక్స్ డైరెక్టర్ శబరి నాయర్ మాట్లాడుతూ.. పూజా ధింగ్రా తన పాకశాస్త్ర కళతో ఫీనిక్స్‌మార్కెట్ సిటీ వినియోగదారులను మైమరిపింపజేశారని తెలిపారు. వంటల పట్ల ఆమెకున్న అభిరుచి, అంకితభావం నిజంగా స్ఫూర్తిదాయకమని ప్రశంసించారు.




ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న ఇరు సంస్థల ప్రతినిధులు

ఆస్ట్రేలియా వర్సిటీతో సిమట్స్ ఒప్పందం

చెన్నై, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): సిమట్స్ ఇంజినీరింగ్ కళాశాల ఆస్ట్రేలియాలోని న్యూక్యాసిల్ యూనివర్శిటీతో ఒప్పందం కుదుర్చుకుంది. సంస్థ ఛాన్సలర్ డాక్టర్ ఎన్ఎం వీరయ్యన్, డైరెక్టర్ డాక్టర్ దీపక్ నల్లస్వామి, వైస్‌ఛాన్సలర్ డాక్టర్ ఎస్.సురేష్‌కుమార్, ఆస్ట్రేలియా వర్శిటీ వీసీ అలెక్స్ జెలిన్‌స్కై తదితరులు ఈ ఒప్పందపత్రాలను మార్చుకున్నారు. ఈ ఒప్పందం ద్వారా ఇరు సంస్థల్లో విద్యాభ్యాసం చేసే విద్యార్థుల పరిశోధనలకు ఇది ఎంతో దోహదపడుతుందని సిమట్స్ నిర్వాహకులు తెలిపారు.

మిడ్ స్వీడన్ వర్శిటీతో శ్రీరామచంద్రా వర్శిటీ ఒప్పందం


ఒప్పంద పత్రాలపై సంతకాలు చేస్తున్న ఆండర్స్ ఫాల్‌స్ట్రామ్, ప్రొఫెసర్ ఉమా శంకర్

చెన్నై, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోరూరులో శ్రీరామచంద్రా ఉన్నత విద్యా పరిశోధన సంస్థ (శ్రీరామచంద్రావర్శిటీ) మిడ్ స్వీడన్ విశ్వవిద్యాలయంతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ప్రకారం రెండు విశ్వవిద్యాలయాలు కలిసికట్టుగా విద్యార్థులు, అధ్యాపకులలో ప్రతిభా పాటవాలను పెంచేదిశగా చర్యలు చేపట్టనున్నాయి. ముఖ్యంగా క్రీడలు, నర్సింగ్, ప్రజారోగ్యం తదితర అంశాలపై ఉమ్మడి అధ్యయనం, పరిశోధనలు నిర్వహించనున్నాయి. ఈ సందర్భంగా మిడ్ స్వీడన్ విశ్వవిద్యాలయం నుంచి విచ్చేసిన ఏడుగురు సభ్యులు విచ్చేసి ఒప్పందం అంశాలు గురించి వివరించారు. ఒప్పంద పత్రాలపై మిడ్ స్వీడన్ యూనివర్శిటీ వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ ఆండర్స్ ఫాల్‌స్ట్రామ్, శ్రీరామచంద్రా యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ ఉమా శంకర్ సంతకాలు చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీరామచంద్రావర్శిటీ ప్రో వైస్‌ఛాన్సలర్ మహేష్ వాకమూడి, రిజిస్ట్రార్ రూపా నాగరాజన్, డీన్ కల్పనా బాలకృష్ణన్ తదితరులు పాల్గొన్నారు.



విజేతల పేర్లు విడుదల చేస్తున్న ప్రముఖులు

చిన్నారులకు బహుమతుల ప్రదానం

చెన్నై, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): 'సిప్ అకాడమీ' ఆధ్వర్యంలో జరిగిన గణాంకాల ప్రతిభా పరీక్షల్లో విజేతలుగా నిలిచిన చిన్నారులకు బహుమతుల ప్రదానం జరిగింది. స్థానిక నీలాంగరైలో జరిగిన ఈ పోటీల్లో వివిధ పాఠశాలలకు చెందిన 1300 మందికి పైగా విద్యార్థులు పాల్గొనగా ఇందులో వివిధ రకాలైన మేథమేటిక్స్ పోటీలు జరిగాయి. ఇందులో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ రచయిత భారతి భాస్కర్ ముఖ్య అతిథిగా హాజరై విజేతలను ప్రకటించడంతో పాటు బహుమతులను కూడా ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఇంకా సిప్ అకాడమీ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ దినేష్ విక్టర్ తదితరులు కూడా పాల్గొన్నారు.

ఎస్కేపీడీలో ఘనంగా మాతృభాషా దినోత్సవం


త్రినాథ్, గురుమూర్తిని శాలువతో సత్కరిస్తున్న దృశ్యం

ప్యారీస్, ఫిబ్రవరి 26: స్థానిక జార్జిటౌన్ గోవిందప్పనాయకన్ వీధిలో ఉన్న ఎస్కేపీడీ బాలుర మహోన్నత పాఠశాలలో సోమవారం అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం, భాషా సాహిత్య సాంస్కృతిక సంఘ సమాప్తి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఓరుగంటి లీలారాణి అధ్యక్షతన జరిగిన ఈ వేడుకల్లో త్యాగరాయ కళాశాల తెలుగు విభాగం అధ్యాపకులు మునిరత్నం ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పాఠశాల కరచాలకులు ఎస్ఎం సుదర్శనం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా ఎస్కేపీడీ పాఠశాల ప్లస్ వన్ విద్యార్థి త్రినాథ్ ఇటీవల రాష్ట్రస్థాయిలో జరిగిన పోటీల్లో 'ఇన్‌స్పైర్' అవార్డు అందుకున్నాడు. అతనితో పాటు గణిత ఉపాధ్యాయులు గురుమూర్తిలను శాలువతో ఘనంగా సత్కరించారు.

మెడికల్ హబ్‌గా చెన్నై



సదస్సులో పాల్గొన్న వైద్యనిపుణులు

పెరంబూర్, ఫిబ్రవరి 26: రాజధాని నగరం చెన్నై మెడికల్ హబ్‌గా మారిందని పలువురు వైద్యనిపుణులు అభిప్రాయపడ్డారు. రోటరీ క్లబ్, చెన్నై ఆధ్వర్యంలో చెన్నై మెగాపాలిస్ 2020 7వ ఎడిషన్‌లో భాగంగా 'బ్లూ ప్రింట్ ఫర్ హెల్త్‌కేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అనే అంశంపై సదస్సు జరిగింది. ఈ సదస్సులో కామన్‌వెల్త్ మెడికల్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ప్రొఫెసర్ డా.ఎ.జయపాల్, కావేరి హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మణివన్నన్ సెల్వరాజ్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్, తమిళనాడు బ్రాంచ్ కార్యదర్శి డాక్టర్ ఎస్.కార్తీక్ ప్రభు, స్టేట్ ప్లానింగ్ కమిషన్, ఎమ్మెల్యే డాక్టర్ ఎళిలన్ నాగనాథన్, త్రీఐ మెడికల్ టెక్నాలజీస్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎం.బాలసుబ్రమణ్యం, లైఫ్‌సెల్ ఇంటర్నేషనల్, నానో సెల్ చైర్మన్ అభయకుమార్, రోటరీ క్లబ్ ఆఫ్ చెన్నై కర్నాటిక్ (మోడరేటర్) ఫిలాసఫీ చైర్మెన్ డాక్టర్‌నవీన్ చౌదరి పాల్గొని, నగరంలో ఆరోగ్యరంగంలో వస్తున్న మార్పులు, అందుబాటులో ఉన్న ఆధునాతన పరికరాలు, సాంకేతిక పరిజ్ఞానం తదితరాల గురించి వివరించారు.

మౌర్యుల అనంతరం రాజ వంశాలు

శుంగవంశం

క్రీ.పూ.185లో చివరి మౌర్య రాజైన బృహద్రదుడిని చంపి అతని సేనాని పుష్యమిత్రుడు 'శుంగ' వంశాన్ని స్థాపించాడు. మగధను రాజధానిగా చేసుకుని పాలించాడు. ఇతని కాలంలోనే అయోధ్య శాసనాన్ని ధనదేవుడు చెక్కించాడు.

పుష్యమిత్రుని సమకాలీనులు: పంజాబ్, కాబూల్ ప్రాంతాలను పాలిస్తున్న ఇండో గ్రీకు రాజు మినాండర్, కళింగ రాజు ఖారవేలుడు, శాతవాహన రాజు మొదటి శాతకర్ణి ఇతని సమకాలీనులు. అయితే అశ్వమేథ యాగం సందర్భంగా పుష్యమిత్రుని మినాండర్ ఓడించినట్లు తెలుస్తోంది.

శుంగ వంశ చరిత్రకు ఆధారాలు: పతంజలి- మహాభాష్యం, కాళిదాసు- మాళవికాగ్నిమిత్రం, పాణిని - అష్టాధ్యాయి, బాణుడు- హర్ష చరిత్ర, బౌద్ధ గ్రంథం- దివ్యావదన మొదలైనవి. ఉజ్జయిని రాకుమార్తె మాళవికను పుష్యమిత్రశుంగుని కుమారుడైన అగ్నిమిత్రుడు రాక్షస వివాహం చేసుకున్న ఇతివృత్తమే కాళిదాసు 'మాళవికాగ్నిమిత్రం'.

శుంగుల మత విధానం: శుంగుల కాలంలో వైదిక (బ్రాహ్మణ) మతం పునరుద్ధరణ జరిగింది.(దేవభూతి క్రీ.శ.72లో కణ్వ వంశీయుడైన వాసుదేవ కణ్వ చేతిలో మరణించాడు. దీంతో కణ్వవంశ స్థాపన జరిగి, శుంగ వంశం అంతరించింది).

- పుష్యమిత్ర శుంగుని కాలంలో సాంచి, బార్హుత్ స్థూపాలకు వాస్తుపరమైన అలంకరణ చేశారు. దీనిని బట్టి పరమత సహనం ఉన్నట్లు అర్థమవుతుంది. పుష్యమిత్రుడు అనేక మంది బౌద్ధులను సంహరించినట్లు పలు బౌద్ధ గ్రంథాల్లో రాసి ఉంది. కాని బిహార్, అయోధ్య, మాళ్వా ప్రాంతాల్లో బౌద్ధ విహారాలు శుంగుల కాలంలోనే వర్ధిల్లినట్లు 'మహావంశం' అనే బౌద్ధ గ్రంథం పేర్కొంటోంది.
- చివరి శుంగ రాజులలో గొప్ప వాడైన భగబద్రరాజు ఆస్థానంలో గ్రీకు రాయబారి హీలియోడోరస్ (గ్రీకు రాజైన ఆంటియోకిడాస్ ఆస్థానం నుంచి వచ్చాడు) చేరాడు. ఈయన భిల్సా దగ్గర ఉన్న బేస్‌నగర్‌లోని విష్ణుదేవాలయంలో గరుడ స్తంభాన్ని ప్రతిష్ఠించాడు. ఇక్కడే శాసనం కూడా చెక్కించాడు. భాగవతమతం, వాసుదేవ కృష్ణుని గురించి వివరించాడు. రాజకీయంగా చూస్తే... పుష్యమిత్రుని తర్వాత వసుమిత్రుడు, దేవభూతి, భగబద్రుడు మొదలైన వారు పరిపాలించారు. వీరందరి కాలంలో అన్ని మతాలు అభివృద్ధి చెందాయి. వసుమిత్రుడు కోసల రాజు మూలదేముడు చేతిలో హత్యకు గురయ్యాడు.
- శుంగ రాజ్యంలో పాంచాల, కోశాంబి రాజ్యాలు లేవు. అవి అప్పటికే మగధ నుంచి విడిపోయాయి. అంటే శుంగులు మగధను మాత్రమే పాలించారు.

శుంగుల కాలం నాటి ముఖ్యాంశాలు

- వైదిక మతాన్ని, ఆచారాలను, హైందవ పద్ధతులను పునరుద్ధరించారు. సంస్కృత భాషకు ఆదరణ పెరిగింది. పాళి, ప్రాకృత భాషల ప్రాధాన్యం తగ్గింది.
- వాయువ్య సరిహద్దుల వద్ద గ్రీకుల దాడుల నుంచి భారత దేశాన్ని కొన్ని సంవత్సరాల వరకు మాత్రమే కాపాడగలిగారు. ఈ కాలంలో సాంచీ స్థూపానికి తోరణాన్ని అద్భుతంగా చెక్కించారు. తర్వాత శాతవాహన రాజు శాతకర్ణి దీనికి తుది మెరుగులు పెట్టించాడు.
- క్రీ.పూ. రెండో శతాబ్దంలో పాణిని రచించిన వ్యాకరణానికి పతంజలి వ్యాఖ్యానం రాశాడు. దీని పేరు 'మహాభాష్యం'.
- శుంగులు అశ్వమేథయాగాలు చేశారు. వీరి ప్రధాన దైవం విష్ణువు. వీరి కాలంలో భాగవతం ప్రాముఖ్యం పెరిగింది. అయోధ్య శాసనంలో పుష్యమిత్రుడు రెండు అశ్వమేథయాగాలు చేసినట్లు రాసి ఉంది.

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం

ఇండియన్ హిస్టరీ

మౌర్యులు - శుంగుల శిల్పకళలో భేదాలు

శుంగుల శిల్పకళపై విదేశీ ప్రభావం లేదు. మౌర్యుల శైలికి భిన్నమైన శైలి వీరిది. వీరి కాలంలో బౌద్ధ స్థూపాల నిర్మాణాలు మాత్రమే జరిగాయి. చైత్యాలు, విహారాలు నిర్మించలేదు. వీరిది మౌర్యుల శిల్పంలా గుండ్రటి రూపం కాదు. అర్ధాకార రీతిలో ఉన్నాయి. మౌర్యుల శిల్పకళ కథకు సంబంధం లేని శిల్పాలు. కాని శుంగులవి జాతక కథలను తెలిపే శిల్పాలు. మౌర్యుల శిల్పాలు ఎక్కువగా జంతువులకు సంబంధించినవి. ఉదాహరణకు...

- ఒకీరా వద్ద సింహస్తంభం - ఎలాంటి అలంకరణ లేదు
- రామ్ పూర్వాస్తంభం - దీనిపై ఏనుగు శిఖరం ఉంది
- లౌరియానందన్‌గర్ - దీని శిఖరంపై సింహం ఉంది
- రుమ్మిందై స్తంభం(నేపాల్) - గుర్రం ఉంది
- సార్‌నాథ్ - దీని శిఖరంపై నాలుగు సింహాలు ఉన్నాయి.

శుంగుల శిల్పాలలో ఎక్కువగా మానవ ఆకారాలు ఉన్నాయి. ఉదాహరణకు బార్హుత్ స్థూపంపై అజాత శత్రు తన తండ్రి బింబిసారుని చంపినందుకు ప్రాయశ్చిత్తం చెప్పవలసిందిగా బుద్ధున్ని అర్థిస్తున్న శిల్పం అద్భుతంగా చెక్కారు.

- మౌర్యుల శిల్పకళను చక్రవర్తులు, బౌద్ధ సంఘాలు, ధనికులైన ప్రజలు పోషించారు. మౌర్యుల కళలోని పరిణితి శుంగుల శిల్పాలలో కనిపించదు. మౌర్యుల కళపై పర్షియన్ల ప్రభావం ఎక్కువ. శుంగుల కళ స్వదేశీయమైనది. పశ్చిమాసియ శిల్ప కళ ప్రభావం లేక పోలేదు.
- మౌర్యుల శిల్పాలు విడి విడిగా ఉండగా, శుంగుల శిల్పాలు పెద్ద పెద్ద కళా ఖండాల మీద చెక్కారు. శుంగుల చిత్రాలను 'చరణ చిత్రాలు' అంటారు. బౌద్ధానికి చెందినవి. వస్త్రంపై బుద్ధుడి జీవిత విశేషాలు చిత్రీకరించారు. మౌర్యుల కళ లౌకికమైనది.

క్షాత్రప రాజులు

వీరు శకుల వద్ద అధికారులుగా పని చేశారు. తరవాత కొంత కాలం కుషాణులకు కూడా సామంతులుగా ఉన్నారు. క్షాత్రపులందరిలో పశ్చిమ క్షాత్రపులు గొప్పవారు. వీరిలో గొప్పవాడు నహపాణుడు.

నహపాణుడు: శాతవాహనుల నుంచి మహారాష్ట్రను జయించాడు. బరోచ్(గుజరాత్), మహారాష్ట్ర, అజ్మీర్(రాజస్థాన్), మాళ్వా(మధ్యప్రదేశ్) మొదలైన ప్రాంతాలను ఇతను పాలించాడు. నహపాణుడు స్వతంత్రంగా పాలించిన మొదటి క్షాత్రపరాజు. హిందూ సంప్రదాయాలను పాటించాడు. ఇతని భార్య బౌద్ధులకు గుహాలయాలను నిర్మించింది. ఉజ్జయిని క్షాత్రపులలో తొలిరాజు యశోవర్మన్. వీరి వంశం పేరు 'కర్ణమక'. తరవాత రాజు చష్టణుడు. ఉజ్జయిని క్షాత్రపులలో చివరి రాజు రుద్రదాముడు. చష్టనుని కాలం నుంచి వీరు కుషాణులకు సామంతులయ్యారు.

జునాగఢ్ శాసనం: దీనిని రుద్రదమనుడు రాయించాడు. ఇతని గురించిన వివరాలే ఈ శాసనంలో ఎక్కువగా ఉన్నాయి. క్రీ.శ.150లో రుద్రదమనుని పాలన ప్రారంభమైంది. గౌతమీపుత్ర శాతకర్ణి ఇతనికి సమకాలీనుడు. రుద్రదమనుడు మాళ్వా, సౌరాష్ట్ర(గుజరాత్), కచ్, కొంకణతీరం, తూర్పు పంజాబ్, వింధ్యా ఆరావళి పర్వతాల పశ్చిమ ప్రాంతాలను జయించాడు.

- చంద్రగుప్త మౌర్యుని కాలంలో గుజరాత్‌లో నిర్మించిన 'సుదర్శన చెరువు'కు పన్నులు విధించి, మరమ్మతులు చేయించాడు. రుద్రదామునికి సంగీత, తర్క, వ్యాకరణ శాస్త్రాల్లో ప్రావీణ్యం ఉండేది.
- చివరికి శకులు, పహ్లవులు, స్వదేశీ హిందూ సంస్కృతిలో కలిసిపోయారు. హిందూ దేవతలను ఆరాధించారు.

బార్హుత్ స్థూపం ప్రాధాన్యం



ఈ స్థూపాన్ని అశోకుడు నిర్మించాడు. కాని దీని చుట్టూ గల వేదిక లేక ప్రాకార తోరణాలు క్రీ.పూ.150 నాటి శుంగుల కాలంలో నిర్మించారు. బార్హుత్ స్థూపంలో అప్సరసల శిల్పాలు కూడా ఉన్నాయి. ఈ స్థూపం మధ్యప్రదేశ్‌లోని సత్నా జిల్లాలో ఉన్న ఒక గ్రామంలో ఉంది. దీనిపై ఉన్న అంశాలను అలెగ్జాండర్ కన్నింగ్ హోం గాంధార నుంచి వచ్చినట్లుగా గుర్తించాడు. క్రీ.శ.1873లో అలెగ్జాండర్ కన్నింగ్‌హోమ్ బార్హుత్ స్థూపాన్ని సందర్శించాడు. మరుసటి సంవత్సరం స్థలాన్ని తవ్వాడు. జోసఫ్ డేవిడ్ బెగ్లర్ సహాయకుడిగా పనిచేశాడు. ఈ బౌద్ధశైలి భారతీయ కళ ప్రారంభ దశను సూచించడం, బౌద్ధ చిహ్నాంతో ఇండో-గ్రీకు సైనికుడిగా భావించే విదేశీయుడి విగ్రహం ఉండటం... దీనిలోని ప్రత్యేక శైలి.

సాంచి స్థూపం: మొదట అశోకుడు దీనిని నిర్మించాడు. తర్వాత శుంగులు దీనిపై రాతి కప్పు నిర్మాణం చేశారు. దీనిని ఇటుకలతో నిర్మించారు. రాతి అండం, పెద్ద ఛత్రం, వేదిక నిర్మించారు. ఈ స్థూపం తోరణాలపై గల శిల్పాలు ప్రపంచ ప్రఖ్యాతి పొందాయి.



డాక్టర్ ఐ.నీలా,
అసిస్టెంట్ ప్రొఫెసర్,
ప్రభుత్వ మహిళా గురుకుల డిగ్రీ కళాశాల, సూర్యాపేట.

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/FpZEgVDలో చదవండి.

దిక్సూచి DIKSUCHI

ఆర్‌సీబీలో ఎంఎస్-పీహెచ్‌డీ

కేంద్ర ప్రభుత్వానికి చెందిన రీజనల్ సెంటర్ ఫర్ బయోటెక్నాలజీ(ఆర్‌సీబీ, ఫరీదాబాద్)- ఎంఎస్ పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రోగ్రామ్ వ్యవధి అయిదు నుంచి ఏడేళ్ల వరకు ఉంటుంది. సెమిస్టర్ విధానాన్ని అనుసరిస్తారు. నిర్దేశిత రుసుం చెల్లించి భోజన, వసతి సౌకర్యాలు పొందవచ్చు. ఈ ప్రోగ్రామ్‌లో మొత్తం 20 సీట్లు ఉన్నాయి. విదేశీ విద్యార్థులు కూడా అప్లయ్ చేసుకోవచ్చు.



అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి సైన్స్, ఇంజనీరింగ్, మెడిసిన్ విభాగాల్లో బ్యాచిలర్ డిగ్రీ పూర్తిచేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రథమ శ్రేణి మార్కులు ఉండాలి. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్-బయోటెక్నాలజీ(గ్యాట్ బీ) వ్యాలిడ్ స్కోర్ తప్పనిసరి.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.500; దివ్యాంగులు, ఈడబ్ల్యూఎస్, ఎస్సీ, ఎస్టీ, విదేశీ విద్యార్థులకు ఫీజు లేదు.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 30
- **వెబ్‌సైట్:** rcb.res.in

ఇన్సూరెన్స్ అకాడమీలో పీజీడీఎం

పుణెలోని నేషనల్ ఇన్సూరెన్స్ అకాడమీ(ఎన్ఐఏ)- పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్(పీజీడీఎం) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇది రెండేళ్ల వ్యవధి గల ఫుల్ టైమ్ ప్రోగ్రామ్. ఇందులో మొత్తం 180 సీట్లు ఉన్నాయి. ఈ ప్రోగ్రామ్‌కు ఏఐసీటీఈ, ఏఐయూ, ఎన్‌బీఏ గుర్తింపులు ఉన్నాయి. అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్(ఏఐయూ) దీనిని ఎంబీఏ డిగ్రీకి సమానమైనదిగా గుర్తించింది.

ప్రోగ్రామ్ వివరాలు: ఇందులో ఫైనాన్స్, హెచ్‌ఆర్, మార్కెటింగ్, అనలిటిక్స్, టెక్నాలజీ సంబంధిత కోర్ సబ్జెక్టులతో పాటు జనరల్ ఇన్సూరెన్స్, లైఫ్ ఇన్సూరెన్స్, రీ-ఇన్సూరెన్స్ అండ్ పెన్షన్ సబ్జెక్టులు ఉంటాయి. ప్రోగ్రామ్‌లో భాగంగా ఎనిమిది వారాల సమ్మర్ ఇంటర్న్‌షిప్ కూడా ఉంటుంది.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ద్వితీయ శ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. చివరి సంవత్సర పరీక్షలు రాసేవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. క్యాట్ 2023/ఎక్స్ఏటీ 2024/సీమ్యాట్ 2024 అర్హత పొంది ఉండాలి. క్యాట్ 2023లో కనీసం 75 పర్సంటైల్, ఎక్స్ఏటీ 2024లో కనీసం 85 పర్సంటైల్, సీమ్యాట్ 2024లో కనీసం 95 పర్సంటైల్ ఉండాలి. అభ్యర్థుల వయసు 2024 జూలై 1 నాటికి 28 ఏళ్లు మించకూడదు. రిజర్వ్‌డ్ వర్గాల అభ్యర్థులకు రిజర్వేషన్ నిబంధనలు వర్తిస్తాయి.

ఎంపిక: అభ్యర్థులను అకడమిక్ ప్రతిభ, ఇంగ్లీష్‌లో ప్రావీణ్యం, జాతీయ పరీక్ష స్కోర్, గ్రూప్ డిస్కషన్స్ పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేస్తారు.

- **దరఖాస్తు ఫీజు:** రూ.1500
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 15
- **వెబ్‌సైట్:** pgdm.niapune.org.in

జాబ్ కార్నర్

ఇండియన్ నేవీలో ఎస్ఎస్‌సీ ఆఫీసర్లు

ఎజిమల(కేరళ)లోని ఇండియన్ నేవల్ అకాడమీ(ఐఎన్ఏ)లో 2025, జనవరి నుంచి ప్రారంభమయ్యే షార్ట్ సర్వీస్ కమిషన్(ఎస్ఎస్‌సీ) కోర్సులో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైంది.

బ్రాంచి వివరాలు: జనరల్ సర్వీస్: 50, పైలెట్: 20, నావల్ ఎయిర్ ఆపరేషన్స్ ఆఫీసర్: 18, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్: 8, లాజిస్టిక్స్: 30, నావల్ ఆర్మమెంట్ ఇన్‌స్పెక్టరేట్ కేడర్: 10, ఎడ్యుకేషన్: 18, ఇంజనీరింగ్ బ్రాంచ్(జనరల్ సర్వీస్): 30, ఎలక్ట్రికల్ బ్రాంచ్(జనరల్ సర్వీస్): 50, నావల్ కన్‌స్ట్రక్టర్: 20.

అర్హత: సంబంధిత విభాగంలో బీఈ, బీటెక్, ఎంబీఏ, ఎంసీఏ, పీజీ డిప్లొమా ఉత్తీర్ణతతో పాటు నిర్దిష్ట శారీరక/వైద్య ప్రమాణాలు కలిగి ఉండాలి.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 24

వెబ్‌సైట్: www.joinindiannavy.gov.in/

సెయిల్‌లో టెక్నీషియన్‌లు

ఢిల్లీలోని కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ.. స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్(సెయిల్).. వివిధ విభాగాల్లో ఆపరేటర్ కమ్ టెక్నీషియన్(ట్రెయినీ)-(ఓసీటీటీ) పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం ఖాళీలు: 324 (మెటలర్జీ: 57, ఎలక్ట్రికల్: 64, మెకానికల్: 100, సివిల్: 22, కెమికల్: 18).

అర్హతలు: పదో తరగతి లేదా తత్సమాన ఉత్తీర్ణతతో పాటు సంబంధిత సబ్జెక్టులో ఇంజనీరింగ్ డిప్లొమా చేసి ఉండాలి. ఓసీటీటీ-డ్రాఫ్ట్స్‌మన్ పోస్టుకు ఏడాది పాటు డ్రాఫ్ట్స్‌మన్/డిజైనర్‌గా పని అనుభవం ఉండాలి.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 18

వెబ్‌సైట్: https://sail.co.in/

నవ్య | చిత్రజ్యోతి



హాలీవుడ్‌లో రిలీజ్ అనుకున్నాం

శ్రీవిష్ణు, ప్రియదర్శి, రాహుల్ రామకృష్ణ ముఖ్య తారాగణంగా తెరకెక్కిన చిత్రం 'ఓం భీమ్ బుష్'. 'హుషారు' ఫేమ్ శ్రీ హర్ష కొనుగంటి దర్శకుడు. వి. సెల్యులాయిడ్, సునీల్ బలుసు నిర్మాతలు. మార్చి 22న ఈ చిత్రం విడుదలవుతోంది. సోమవారం చిత్రబృందం టీజర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా శ్రీ విష్ణు మాట్లాడుతూ 'ఈ సినిమాను ఇంగ్లీష్‌లో తీసి హాలీవుడ్‌లో రిలీజ్ చేయాలనుకున్నాం. ఇలాంటి పాయింట్‌తో ఇప్పటివరకూ ఏ సినిమా రాలేదు. మా ముగ్గురి పాత్రలూ ప్రేక్షకులకు విపరీతంగా నచ్చుతాయి. రెండు గంటల పాటు నవ్వుతూనే ఉంటారు. గుప్తనిధుల కోసం ముగ్గురు శాస్త్రవేత్తలు చేసిన ప్రయాణం ఆసక్తికరంగా ఉంటుంది' అని చెప్పారు. ట్రైలర్, సినిమా అద్భుతంగా ఉంటాయని ప్రియదర్శి చెప్పారు. దాదాపు ఏణ్ణార్థం స్పేస్ షూట్‌లో షూటింగ్ చేశాం అని రాహుల్ రామకృష్ణ తెలిపారు. ఈ చిత్రంలో ప్రీతి ముకుందన్, అయేషాఖాన్, శ్రీకాంత్ అయ్యంగార్, ఆదిత్య మీనన్ కీలకపాత్రలు పోషించారు. సంగీతం: సన్నీ ఎంఆర్. సినిమాటోగ్రఫీ: రాజ్ తోట

శ్రీవిష్ణు

ఇకమీదట ఇలాంటివి వద్దు



మోహన్‌బాబు

'కొంతమంది స్వార్థపరులు వారి రాజకీయ లబ్ధి కోసం నా పేరును ఉపయోగించుకొంటున్నట్లు తెలిసింది. మీరు ఏ పార్టీ వారైనా మీ ప్రయోజనాల కోసం నా పేరును వాడుకోవద్దు' అని మోహన్‌బాబు విజ్ఞప్తి చేశారు. ఇక మీదట ఇలాంటివి పునరావృతమైతే చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని ఆయన సోమవారం సోషల్ మీడియా వేదికగా హెచ్చరించారు. ఎవరిష్టం వారిది, చేతనైతే నలుగురికి సాయపడాల్సింది పోయి ఏ సంబంధం లేనివారిని రాజకీయాల్లోకి లాగడం బాధాకరమని ఆయన విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. విష్ణు కథానాయకుడిగా నటిస్తున్న 'కన్నప్ప' చిత్రంలో మోహన్‌బాబు కీలకపాత్ర పోషిస్తున్నారు.

అందగత్తెగా అలరించాలనుంది



'హీరోయిన్ అవ్వాలనే నా చిన్ననాటి కలను టాలీవుడ్ నిజం చేసింది. అందుకు తెలుగు పరిశ్రమకు ఎప్పటికీ రుణపడి ఉంటాను. ఇప్పుడు గ్లామర్ పాత్రల్లో ప్రేక్షకులను అలరించాలనేదే నా లక్ష్యం' అని హీరోయిన్ రాశి సింగ్ చెప్పారు. శివ కందుకూరి హీరోగా పురుషోత్తం రాజ్ దర్శకత్వం వహించిన చిత్రం 'భూతద్ధం భాస్కర్ నారాయణ'. స్నేహాల్, శశిధర్, కార్తీక్ నిర్మించారు. మార్చి 1న ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా రాశి సింగ్ సినిమా విశేషాలను మీడియాతో పంచుకున్నారు.

- మాది రాయ్‌పూర్. ఢిల్లీ యూనివర్సిటీలో చదువుకున్నాను. ఎయిర్‌హోస్టెస్‌గా ఉద్యోగం చేశాను. చిన్నప్పటి నుంచే హీరోయిన్ అవ్వాలనుకున్నాను. 'ప్రేమ్‌కుమార్, పాపం పసివాడు' సినిమాల్లో నటించాను. కథానాయికగా మంచి పాత్రలు దక్కుతున్నందుకు ఆనందంగా ఉంది. ముందుముందు వైవిధ్యమైన పాత్రలతో మంచి నటిగా గుర్తింపు తెచ్చుకోవాలనేది నా కోరిక.
- అనుకోకుండా 'భూతద్ధం...' ఆడిషన్‌కు వెళ్లి హీరోయిన్‌గా ఎంపికయ్యాను. మా దర్శకుడు తను రాసుకున్న పాత్రకు నేను సరైన ఎంపిక అని భావించారు. ఈ సినిమాలో నా పాత్ర పేరు లక్ష్మి. తనో జర్నలిస్ట్. ఆధునిక భావాలున్న యువతిగా కనిపిస్తాను. కథ విన్నప్పుడు సంభ్రమాశ్చర్యాలకు గురయ్యాను. సస్పెన్స్, థ్రిల్, రొమాన్స్, పాటలు... ఇలా అన్నీ ఈ చిత్రంలో ఉన్నాయి.

ఒక యోధుడి ప్రేమకథ



సిద్ధార్థ్ మల్హోత్రా, రాశీఖన్నా జంటగా నటించిన హిందీ చిత్రం 'యోధ'. దిశాపటానీ కీలకపాత్ర పోషించారు. దర్శక ద్వయం సాగర్ అంబ్రే, పుష్కర్ ఓజా దర్శకత్వం వహించారు. ధర్మ ప్రొడక్షన్స్ భారీ బడ్జెట్‌తో నిర్మించింది. మార్చి 15న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇటీవలే యూనిట్ ఈ చిత్రం నుంచి తొలి గీతాన్ని విడుదల చేసి ప్రచార కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. 'యోధ' ప్రమోషన్స్‌లో భాగంగా సోమవారం సిద్ధార్థ్ మల్హోత్రా, రాశీ ఖన్నా తెలుగు మీడియాతో ముచ్చటించారు. సిద్ధార్థ్ మాట్లాడుతూ "యోధ' యువతలో దేశ భక్తిని, ధైర్యాన్ని పెంపొందించే ఆసక్తికర కథతో తెరకెక్కింది. ఈ సినిమాలో భాగమవ్వడమే ఒక అసాధారణ ప్రయాణం. ప్రేక్షకులను ఈ చిత్రం తప్పకుండా అలరిస్తుంది' అన్నారు. రాశీ ఖన్నా మాట్లాడుతూ "యోధ'లో పనిచేయడం ఒక ఉత్తేజకర అనుభవం. ధైర్యం, ప్రేమ కలబోతగా తెరకెక్కిన చిత్రమిది. ప్రేక్షకులను తప్పకుండా ఆకట్టుకుంటుంది' అని చెప్పారు.



కాన్సెప్ట్ మెప్పించింది

విరాన్ ముత్తంశెట్టి కథానాయకుడిగా వేణు మురళీధర్ వి. దర్శకత్వం వహించిన చిత్రం 'ముఖ్య గమనిక'. ఇటీవలే విడుదలైన ఈ చిత్రం ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకుంటోందని చిత్రబృందం సంతోషం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా నిర్వహించిన సక్సెస్ మీట్‌లో దర్శకుడు మాట్లాడుతూ 'కంటెంట్ బాగుంటే చిన్న సినిమా అయినా తెలుగు ప్రేక్షకులు ఆదరిస్తారు అనడానికి మా చిత్రమే ఉదాహరణ. రోజురోజుకూ థియేటర్ల సంఖ్య పెరుగుతోంది' అని చెప్పారు. నిర్మాతలు రాజశేఖర్, సాయికృష్ణ మాట్లాడుతూ 'కొత్త కాన్సెప్ట్‌తో తీయడం వల్ల సినిమా ప్రేక్షకులకు చేరువైంది. తొలి చిత్రమే అయినా దర్శకుడు మంచి అవుట్‌పుట్ ఇచ్చారు' అని ప్రశంసించారు. 'ముఖ్య గమనిక'ను ఆదరిస్తున్న ప్రేక్షకులకు హీరోయిన్ అర్యన్ కృష్ణన్ ధన్యవాదాలు తెలిపారు.

కృష్ణ నిర్యాణం నుంచి కల్కి అవతారం వరకు



దేశవ్యాప్తంగా సినీ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రం 'కల్కి 2898 ఏడీ'. ప్రభాస్ కథానాయకుడు కావడం, కమల్ హాసన్ ప్రతినాయకుడిగా కనిపించనుండడం సినిమాపై క్రేజ్‌ను పెంచాయి. ఇక ప్రతిభావంతుడైన దర్శకుడిగా పేరు పొందిన నాగ్‌అశ్విన్ విజన్ ఈ సినిమాకు ప్రత్యేక ఆకర్షణ. ఊహకు అందని స్థాయిలో ఆయన 'కల్కి' చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారని ప్రచార చిత్రాలతోనే తెలుస్తోంది. ఆయన ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా 'కల్కి' కథకు సంబంధించిన విశేషాలను వివరించారు. 'మహాభారత గాథ, 'స్టార్ వార్స్' సినిమాలు నాకు చాలా ఇష్టం. ఈ రెండు విభిన్న ప్రపంచాలను కలుపుతూ ఓ సినిమా చేయాలనే ఆలోచనలోంచి 'కల్కి' చిత్రం పుట్టింది. ఈ సినిమా కథ మహాభారత కాలం నాటి శ్రీకృష్ణ నిర్యాణంతో మొదలై కల్కి అవతారం వరకూ సాగుతుంది. అందుకే టైటిల్ అలా పెట్టాం. మొత్తం ఆరు వేల సంవత్సరాల కథ ఇది. గతం నుంచి భవిష్యత్తులోకి చేసే ప్రయాణం. ముందుముందు ప్రపంచం ఎలా ఉంటుందో చూపించే ప్రయత్నం చేశాం. దానికోసం అద్భుతమైన ఊహా ప్రపంచాన్ని సృష్టించాం. 'బ్లేడ్ రన్నర్' లాంటి హాలీవుడ్ చిత్రానికి అనుకరణగా అనిపించకుండా జాగ్రత్తలు తీసుకోవడం సవాల్‌గా అనిపించింది. ఏఐ టెక్నాలజీ ఉపయోగించకుండా మా సృజనకు పదునుపెట్టి చాలా కష్టపడి ఈ సినిమాను తెరకెక్కిస్తున్నాం' అని చెప్పారు. మే 9న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. దిశాపటానీ, దీపికా పదుకొనే కథానాయికలు. అమితాబ్ బచ్చన్ కీలకపాత్ర పోషిస్తున్నారు. వైజయంతీ మూవీస్ పతాకంపై సి. అశ్వనీదత్ నిర్మిస్తున్నారు.



'యువత, కందిరీగ' తదితర చిత్రాల్లో హీరోయిన్‌గా నటించిన అక్ష పర్దాసానీ ఓ ఇంటివారయ్యారు. తన స్నేహితుడు, సినిమాటోగ్రాఫర్ కౌశల్‌ను సోమవారం పెళ్లాడారు. ఆ ఫొటోలను అక్ష ఇన్‌స్టాగ్రామ్ ద్వారా అభిమానులతో పంచుకున్నారు.

అలరించే అమ్మపాట



విశ్వ కార్తికేయ, ఆయుషి పటేల్ హీరో హీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం 'కలియుగం పట్టణంలో'. రమాకాంత్ రెడ్డి దర్శకుడిగా పరిచయమవుతున్నారు. డాక్టర్ కందుల చంద్ర ఓబుల్‌రెడ్డి, జి. మహేశ్వరరెడ్డి, కాటం రమేశ్ సంయుక్తంగా నిర్మించారు. మార్చి 22న ఈ చిత్రం విడుదలవుతోంది. చిత్రబృందం ప్రచార కార్యక్రమాల్లో వేగం పెంచింది. సోమవారం దర్శకుడు వశిష్ఠ చేతుల మీదుగా 'జో జో లాలీ అమ్మ' అంటూ సాగే గీతాన్ని విడుదల చేశారు. పాట చాలా బావుందని యూనిట్‌ను ఆయన అభినందించారు.

గజల్ గాయకుడు పంకజ్ ఉధాస్ కన్నుమూత



"చిట్టి ఆయా హై", "ఔర్ ఆహిస్తా కీజియే బాతే" అంటూ మధురమైన గానంతో సంగీత ప్రియులను మైమరపించిన ఆ గొంతు మూగబోయింది. ప్రముఖ గజల్, నేపథ్య గాయకుడు పంకజ్ ఉధాస్ (72) ఇక లేరు. దీర్ఘకాలిక అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ముంబైలోని బ్రీచ్ క్యాండీ ఆస్పత్రిలో సోమవారం ఉదయం 11 గంటల ప్రాంతంలో తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య ఫరీదా, కూతుళ్లు రేవా, నయాబ్ ఉన్నారు. పంకజ్ ఉధాస్ మరణ వార్తను నయాబ్.. ఇన్‌స్టాగ్రామ్ వేదికగా వెల్లడించారు. చాలా బరువైన హృదయంతో.. పద్మశ్రీ పంకజ్ ఉధాస్ కన్నుమూశారని తెలియజేయడానికి మేము చింతిస్తున్నామని ఆమె ప్రకటించారు. మంగళవారం పంకజ్ ఉధాస్ అంత్యక్రియలు జరగనున్నాయి. "నామ్", "సాజన్", "మొహ్రా" వంటి అనేక హిందీ చిత్రాలకు పంకజ్ ఉధాస్ గాత్రదానం చేశారు. పంకజ్ గుజరాత్‌లో సంగీత నేపథ్యం ఉన్న కుటుంబంలో జన్మించారు. ఆయన తండ్రి కేశుభాయ్ తీగల వాయిద్యం దిల్రుబాను వాయించే వారు. ఆయన ఇద్దరు సోదరులు మన్హర్ ఉధాస్, నిర్మల్ ఉధాస్ కూడా గాయకులే. 1986లో విడుదలైన నామ్ చిత్రంలోని "చిట్టి ఆయా హై" పాటతో ఆయన ప్రొఫెషనల్ సింగర్‌గా గుర్తింపు పొందారు. ఆ తర్వాతి నుంచి ఆయన చాలా ఆల్బమ్‌లను రికార్డు చేశారు. 2006 సంవత్సరంలో భారత ప్రభుత్వం పంకజ్ ఉధాస్‌ను పద్మశ్రీ పురస్కారంతో సత్కరించింది.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/gl8Gctj లో చదవండి.